
కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో క్రేన్ సహాయంతో గోదావరిలో వినాయక విగ్రహం నిమజ్జనం చేస్తున్న దృశ్యం




రాజమహేంద్రవరంలో గోదావరిలో నిమజ్జనానికి తీసుకొస్తున్న గణేష్ ప్రతిమలు.. నిమజ్జన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న పోలీసు అధికారులు

ప్రశాంతంగా గణేష్ నిమజ్జనాలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): గణేష్ నిమజ్జనాలు గురువారం 9వ రోజున ప్రశాంతంగా జరిగాయి. పోలీసులు ఎక్కడికక్కడ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌కి అంతరాయం కలగకుండా సాఫీగా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. విగ్రహాలు ఎక్కువగా లాంచీల రేవుకు మళ్లించారు. అక్కడ లాంచీకి పంటును అనుసంధానించి, దానిపై ఐదారు విగ్రహాల చొప్పున చేర్చి వాటిని గోదావరిలోకి కొంతమేర తీసుకెళ్లి నిమజ్జనం చేస్తున్నారు. అడిషనల్ ఎస్పీలు మురళీకృష్ణ, సుబ్బరాజు ఆయా ఘాట్లకు వెళ్లి పరిస్థితిని సమీక్షించి పలు సూచనలు చేశారు. రాత్రి సమయంలో ఎక్కువ సంఖ్యలో విగ్రహాలను తీసుకొస్తారని లైటింగ్ ఏర్పాట్లను చేశారు. మండపాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన సమయంలో నిజమజ్జనానికి వచ్చే మార్గం, తేదీ, సమయం వంటి వాటిని పోలీసులు తీసుకున్నారు. దీంతో ఆయా సమయాలకు అనుగుణంగా పహారా ఏర్పాట్లు చేస్తున్నారు.



పత్రి చెత్తలోకి.. పీవోపీ గోదావరిలోకి..

- మునిసిపల్ కార్పొరేషన్ నిర్వాకం
- ఈ ఏడాది కొత్త ఆలోచనతో ఇబ్బందులు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పత్రి నిమజ్జనం విషయంలో మునిసిపల్ కార్పొరేషన్ నిర్వాకం భక్తుల మనోభావాలను నొచ్చుకునేలా చేస్తోంది. అవసరమైన వాటిని చెత్తలో పడేస్తూ.. హాని కలిగించే వాటిని నదీ జలాల్లో కలుపుతున్నారు. చవితి పూజల్లో 21 రకాల పత్రిది ప్రధాన స్థానం. ఆ దళాలను నీటిలో కలపడం వల్ల మేలు జరుగుతుంది. మారేడు, నేరేడు, ఉసిరి, మామిడి, జమ్మి తదితర ఆకులు, శేష పూలమాలలు నీటిని శుద్ధి చేయడానికి ఉపయోగపడితే, బియ్యం, పండ్లను జలచరాలు ఆహారంగా తీసుకుంటాయి. ఒకప్పుడు మట్టితో చేసిన ప్రతిమల వల్ల హాని ఉండేది కాదు. పూర్వం పత్రిని నూతిలో కలిపితే ఏడాది వరకూ సహజ బ్లీచింగ్‌గా పని చేసి నీళ్ల శుద్ధిగా ఉండేవి. అందుకే ఆ సంప్రదాయానికి మన పెద్దలు దైవత్వాన్ని ఆపాదించి ప్రకృతికి మేలు చేసే అలవాటును అందించారు. ఆ మహత్తర ఏర్పాటును ఇప్పుడు మునిసిపల్ కార్పొరేషన్ చెత్త కుప్పల్లోకి చేర్చడం భక్తులకు ఆగ్రహం కలిగిస్తోంది. వినాయకుడి చవితి పూజలో ఆధ్యాత్మికం ఒక కోణమైతే.. ప్రకృతికి మేలు చేయడం రెండో కోణం. పూజలో వినియోగించే ఆకులు(పత్రాలు) నుంచి ఆల్కలాయిడ్స్ వెలువడి నీటిలో కలవడం ద్వారా నీటి శుద్ధి జరుగుతుంది. సూక్ష్మజీవులు నశిస్తాయి. పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో సహాయం చేస్తాయి. చవితి సాధారణంగా ఆగస్టు నెలలో వస్తుంది. అప్పుడు వర్షాల వల్ల జల వనరుల్లోకి కొత్త నీరు రాక మొదలవుతుంది. పత్రిలోని పత్రాలు ఆ నీటిని శుభ్రం చేస్తాయి. వినాయక చవితి ఒక పండుగే కాకుండా పర్యావరణానికి, జీవుల మనుగడకు మేలు చేసే ఒక మహత్తర ప్రక్రియని చెప్పవచ్చు. అలాంటి పత్రిని రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ చెత్తలో కలిపేస్తోంది. పత్రిని గోదావరిలో కలపనీయకుండా అన్ని చోట్లా రేవుల వద్ద డస్ట్ బిన్లలో పడేయిస్తున్నారు. వాటిని ట్రాక్టర్లలో డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఇలా రోజుకు సుమారు 2 టన్నుల పత్రిని అక్కడికి చేర్చి ఇతర వ్యర్థాలో కలిపేసి కంపోస్టు ప్రక్రియ చేపడుతున్నారు. 45 రోజులపాటు కుళ్లబెట్టడానికి లారీల్లో గుంటూరు తరలిస్తున్నారు. ఇది తెలుసుకున్న భక్తులు ఈ తంతుకు తాము ఇక్కడి వరకూ పత్రి తీసుకురావడం దేనికని, ఇంటి వద్దకు ఇచ్చే చెత్త సేకరణ ఆటోలకు ఇచ్చేయమంటే సరిపోయేది కదాని ఆగ్రహిస్తున్నారు. ఈ తతంగం చూసి కొందరు గోదావరి బ్రిడ్జిపై నుంచి, నగరానికి దూరంగా ఉండే రేవుల్లోకి తీసుకెళ్లి నిమజ్జనం చేస్తున్నారు. విగ్రహాలను గోదావరిలో కలుపుతున్నారు. విగ్రహాల తయారీలో వాడే ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్, రసాయన రంగులు వంటి వాటివి నీటి ద్వారా మనుషుల్లో చేరి క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులకు కారణం అవుతున్నాయి. వేలల్లో ఉంటున్న విగ్రహాలు కొన్నేళ్లపాటు నీటిని కలుషితం చేస్తున్నాయి. అయినా నీటిలో నిమజ్జనం తప్పడం లేదు. నీటి వనరులను శుభ్రం చేసే పత్రిని వ్యర్థాల్లో పడేస్తూ.. నిషేధం ఉన్న పీవోపీ విగ్రహాలను మాత్రం గోదావరిని కలుషితం చేయడానికి వినియోగించడంపై కార్పొరేషన్ అధికారులు ఆలోచించాల్సిన అవసరం ఉందని భక్తులు అంటున్నారు. పత్రిని గోదావరిలో కలపడం వల్ల ఇబ్బందేమీ లేదు. కానీ పీవోపీ వినాయక విగ్రహాలు తొందరగా నీటిలో కరగవు. నగరంలో రోజుకు 100 టన్నుల వరకూ వ్యర్థాలు పోగవు తున్నాయి. వాటితో కంపోస్టు తయారు చేసే కేంద్రాలు సరిగా పనిచేయడం లేదని ఇటీవలే కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్రి రోజుకు టన్ను, రెండు టన్నులు మాత్రమే ఉంటోంది. అదీ డంపింగ్ యార్డుకు తరలించడంపై భక్తులు మండిపడుతున్నారు.


రాజమహేంద్రవరంలో డంపింగ్ యార్డుకు తరలించిన నిమజ్జనోత్సవ పత్రి, పూజా సామగ్రి


రాజమహేంద్రవరంలోని గోదావరి పుష్కర ఘాట్ వద్ద పేరుకుపోయిన వినాయక పత్రి, పూజా సామగ్రి


లావణ్యలక్ష్మిని కలిసి అభినందిస్తున్న కలెక్టరు పి.ప్రశాంతి

దివ్యాంగురాలికి కలెక్టరు ప్రశాంతి అభినందన

తాళ్లపూడి, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నదేవరపేట గ్రామంలో దివ్యాంగురాలైన ఆకుల లక్ష్మీలావణ్య ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో 500 మార్కులకుగానూ 345 (69 శాతం) మార్కులు సాధించి మొదటి స్థానంలో ఉత్తీర్ణత సాధించింది. దీంతో జిల్లా కలెక్టర్ ప్రశాంతి గురువారం స్వయంగా ఆమె ఇంటికి వెళ్లి అభినందించారు. ఆగస్టు 11న కలెక్టరేట్‌లో లావణ్యలక్ష్మి కలెక్టరును కలిసినప్పుడు ఆమె మీ ఇంటికి వస్తానని చెప్పిన మాటను కలెక్టరు గుర్తుంచుకుని గురువారం తాళ్లపూడి మండలంలో పర్యటనలో భాగంగా లావణ్యలక్ష్మి ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని, అందుకు దివ్యాంగురాలైన లావణ్యలక్ష్మి ప్రత్యక్ష నిదర్శనం అని అన్నారు. ఆకుల లావణ్యలక్ష్మి మాట్లాడుతూ కలెక్టరు తన ఇంటికి స్వయంగా వచ్చి ఆశ్చర్యానికి గురిచేశారని, ఎంతో సంతోషంగా ఉందన్నారు.


భవన నిర్మాణాలను పరిశీలించి అధికారులతో చర్చిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ ప్రశాంతి

భవన నిర్మాణ అనుమతుల జారీలో జాప్యం తగదు

ఇన్‌చార్జి కమిషనర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ అనుమతుల జారీలో ఎక్కడా జాప్యం ఉండకూడదని జిల్లా కలెక్టర్, రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి ఆదేశించారు. గురువారం ప్రకాష్‌నగర్, సోమలమ్మ వుంత రోడ్డు, రెయిన్‌బో హాస్పిటల్ రోడ్డులో పర్యటించి పలు భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడారు. అనుమతులు పొందిన భవన యజమానులు ఇచ్చిన ప్లాన్ ప్రకారం నిర్మాణాలు జరుగుతున్నాయా? లేదా అనే సమగ్రంగా పరిశీలించాలన్నారు. ప్లానింగ్‌లో వ్యత్యాసాలు ఉంటే చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అనుమతులు లేకుండా నిర్మిస్తుంటే నిబంధనల మేరకు నోటీసులు జారీ చేయాలన్నారు. వాహనాలు అపార్టుమెంట్లలో పలే పార్కింగ్ చేసుకునేలా యజమానులకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. ఇష్టానుసారంగా రోడ్లపై పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఇన్‌చార్జి ప్రశాంతి వెంట సీపీ కోటయ్య, ఏసీపీలు శ్రీనివాస్, నాగవల్లి, టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నారు.



- ఉమ్మడి తూ.గో.లో మున్సిపల్, పంచాయతీ ఎన్నికలకు ముందస్తు సన్నాహాలు
- మునిసిపల్, పంచాయతీరాజ్‌శాఖలకు లేఖలు రాసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- 2026 జనవరిలోగా మునిసిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు వచ్చే నెల నుంచే సన్నాహాలు
- అక్టోబరు 15లోగా వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ
- నవంబరు 16 నుంచి 30లోగా పోలింగ్ కేంద్రాల ఖరారు, ఈవీఎంల సన్నద్ధత
- ఉమ్మడి జిల్లాలో రెండు కార్పొరేషన్లు, 9 మునిసిపాలిటీలు, 3 నగర పంచాయతీలు

'స్థానిక' సందడి!

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని స్థానిక సంస్థల ఎన్నికల సందడి కొన్ని నెలల్లో మొదలుకాబోతోంది. మున్సిపల్, పంచాయతీ ఎన్నికలను నిర్వహించడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. వచ్చే ఏడాది జనవరిలోగా అంటే మరో ఐదు నెలల్లో మొత్తం ప్రక్రియ పూర్తి చేసి పోలింగ్, ఎన్నికల ఫలితాల ప్రకటనకు కార్యాచరణ సిద్ధం చేసింది. వచ్చే నెల నుంచే మున్సిపాల్టీలు, పంచాయతీల్లో వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ కసరత్తు ప్రారంభించాలని తాజాగా అధికారులకు ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి త్వరలోనే మొదలు కానుంది. కాగా ఉమ్మడి జిల్లాలో రెండు కార్పొరేషన్లు, 9 మునిసిపాలిటీలు, మూడు నగర పంచాయతీల్లో పుర ఎన్నికలు, 1,073 పంచాయతీల్లో ఎన్నికలు జరగనున్నాయి. కొత్త తూర్పుగోదావరి జిల్లా పరిధిలోకి వచ్చే నిడదవోలు, కొవ్వూరు మున్సిపాలిటీలకు సంబంధించి వార్డుల పునర్విభజన చేయాల్సి ఉన్న నేపథ్యంలో పెరిగే కొత్త వార్డులతో కలిపి ఎన్నికలు నిర్వహించనున్నారు.

(రాజమహేంద్రవరం/కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికల తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలుకాబోతోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో కాకినాడ, రాజమహేంద్రవరం కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, నగర పంచాయతీలకు, ఆ తర్వాత పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎస్ఈసీ రంగం సిద్ధంచేస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరిలో 2021లో మునిసిపల్, పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఆయా మునిసిపల్ చైర్మన్లు, వార్డు కౌన్సిలర్లు, సర్పంచులు, వార్డు మెంబర్ల పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తికాబోతోంది. ఆ తర్వాత వీటికి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే వీరి పదవీకాలం ముగిసేలోపు మూడు నెలల ముందే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈమేరకు పురపాలక, పంచాయతీరాజ్‌శాఖలకు ఎస్ఈసీ లేఖ రాసింది. మున్సిపాల్టీలు, పంచాయతీలకు వచ్చే ఏడాది జనవరిలో ఎన్నికలు నిర్వహించడానికి వీలుగా కసరత్తు ప్రారంభించాలని ఆదేశిస్తూ మార్గదర్శకాలు జారీచేసింది. దీని ప్రకారం వచ్చే నెల 15లోగా వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించింది. అక్టోబరు 16 నుంచి నవంబరు 15లోగా వార్డులవారీగా ఓటర్ల జాబితాల ప్రచురణ, నవంబరు 1 నుంచి 15లోగా ఎన్నికల అధికారుల నియామకం, నవంబరు 16నుంచి 30లోగా పోలింగ్ కేంద్రాల ఖరారు, ఈవీఎంలను సిద్ధం చేయడం పూర్తిచేయాలని ఆదేశించింది. డిసెంబరు 15లోపు రిజర్వేషన్లు ఖరారు, 2026 జనవరిలో ఎన్నికల నోటిఫికేషన్, అదే నెలలో ఫలితాల వెల్లడికి వీలుగా ఏర్పాట్లు చేయాలని సూచించింది. ఇక కాకినాడ కార్పొరేషన్‌కు 2022 సెప్టెంబరుకు అయిదేళ్ల పదవీకాలం పూర్తయిన తర్వాత మళ్లీ ఇప్పటివరకు ఎన్నికలు జరగలేదు. అయితే తాజా ఎస్ఈసీ ఆదేశాల నేపథ్యంలో వార్డుల పునర్విభజనతో అదనంగా మరో పది వార్డుల వరకు పెరిగే అవకాశం ఉంది. అటు రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో శివారు గ్రామాల విలీనం సమస్య పరిష్కారమై పెరిగే వార్డులతో కలిపి ఇక్కడా ఎన్నికలు జరగనున్నాయి. ఇదిలాఉంటే 2021 మార్చిలో ఉమ్మడి జిల్లాలో ఏడు మునిసిపాలిటీలు, మూడు నగర పంచాయతీల్లో కలిపి మొత్తం 268 వార్డులకు ఎన్నికలు నిర్వహించారు. అప్పట్లో చేతిలో అధికారం ఉండడంతో వైసీపీ అడ్డగోలుగా 35 వార్డుల్లో బలవంతపు ఏకగ్రీవాలు చేయించింది. దీంతో 233 వార్డులకే ఎన్నికలు జరిగాయి. అయితే మళ్లీ ఇప్పుడు వార్డుల పునర్విభజన నేపథ్యంలో ఒక్కో మున్సిపాల్టీ, నగర పంచాయతీల్లో వార్డుల సంఖ్య మరింత పెరగనుంది. అలాగే ఉమ్మడి జిల్లాలో 2021 ఫిబ్రవరిలో 1,073 పంచాయతీల్లో నాలుగు దశల్లో 11,782 వార్డులకు 12,048 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికలు నిర్వహించారు. 31 పంచాయతీలకు వివిధ కారణాలతో ఎన్నికలు జరగలేదు. వచ్చే ఏడాది జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో వార్డులు మరిన్ని పెరగనున్నాయి.

అప్పుడంతా అరాచకం...

ఉమ్మడి జిల్లాలో 2021లో జరిగిన మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ అరాచకాలు సృష్టించింది. ప్రతిపక్ష టీడీపీ, జనసేనలను నానా హింస పెట్టింది. ఈ పార్టీల అభ్యర్థులను చాలాచోట్ల నామినేషన్లను దాఖలు చేయకుండా అడ్డుకుని ఏకంగా కిడ్నాప్‌లు చేసింది. బెదిరింపులకు దిగి ఏకగ్రీవాలు చేయించుకుంది. అయితే టీడీపీకి బలం ఉన్న చోట జనసేన, జనసేనకు బలం ఉన్న పలు చోట్ల టీడీపీ సహకరించుకుంటూ కదిలి వైసీపీ అరాచకాలను కొంతవరకు అడ్డుకోగలిగాయి. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి అఖండ విజయంతో అధికారంలోకి వచ్చింది. తర్వాత ఒక్కో మున్సిపాల్టీ కూటమి పరిధిలోకి వచ్చేశాయి. తుని, నిడదవోలు, కొవ్వూరు ఇలా కూటమిలో చేరిపోయాయి. ఇంకా కొందరు రావడానికి సిద్ధంగా ఉన్నా ఎన్నికలు జరిగే సమయంలో ఈ తలపోటు మనకెందుకులే అన్నట్టు వదిలేశారు. ఉమ్మడి జిల్లాలో పరిధిలో రాజమండ్రి, కాకినాడ కార్పొరేషన్లు, అమలాపురం, తుని, పిఠాపురం, సామర్లకోట, మండపేట, రామచంద్రపురం, పెద్దాపురం మున్సిపాలిటీలు, ఏలేశ్వరం, గొల్లప్రోలు, ముమ్మిడివరం నగర పంచాయతీలు ఉన్నాయి. అలాగే కొత్త తూర్పుగోదావరి జిల్లా పరిధిలో కొవ్వూరు డివిజన్ కూడా కలవడం వల్ల కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీలు కూడా వచ్చి చేరాయి. అంటే 2 కార్పొరేషన్లు, 9 మునిసిపాలిటీలు, 3 నగర పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది.



● రాజకీయ వర్గాల్లో సందడి

మునిసిపల్ ఎన్నికలు అనగానే పట్టణ ప్రాంతంలో రాజకీయ సందడి మొదలవుతోంది. రాజమండ్రి, కాకినాడ కార్పొరేషన్లకు పాలకవర్గాలు లేనందువల్ల అక్కడ ప్రజాప్రతినిధులు, పదవులు ఆశించేవారు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారు. మిగతా మునిసిపాలిటీల్లో వైసీపీ నేతలు కూడా ఉన్న సంగతి తెలిసిందే. ఈసారి మొత్తం మునిసిపాలిటీలను కైవసం చేసుకోవడానికి టీడీపీ కూటమి సిద్ధమవుతోంది. మొత్తం కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో ఎన్నికలు జరిగితే 300మందికి పైగా కార్పొరేటర్లు, కౌన్సిలర్లుగా ఎన్నికవుతారు. ఇద్దరు మేయర్లు, 12 మంది మున్సిపల్ చైర్మన్లు వస్తారు. డిప్యూటీ మేయర్లు, కోఆప్షన్ సభ్యుల పేరిట కూడా పలువురికి పదవులు వస్తాయి. ఈనేపథ్యంలో టీడీపీ కూటమిలో బాగా సందడి పెరిగింది. వైసీపీ సరైన ప్రతిపక్షంగా కూడా లేకపోవడం వల్ల ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలనే మీమాంసలో పడింది. పలువురు వైసీపీ నేతలు వీలు దొరికితే కూటమిలోకి దూకేసే ప్రయత్నాలు ఇప్పటికే మొదలుపెట్టారు.

రాజమండ్రి కార్పొరేషన్ పరిధి పెరిగేనా..?

రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్‌కు 2021 ఎన్నికలు జరగలేదు. రాజమండ్రి రూరల్ పరిధిలోని పలు గ్రామాల విలీన సమస్య వల్ల ఎన్నికలు జరగలేదు. వాస్తవానికి అంతకుముందే టీడీపీ ప్రభుత్వం రాజమండ్రి రూరల్, రాజానగరం, కోరుకొండ మండలాల్లోని పలు గ్రామాలను విలీనంచేసి 54 డివిజన్లగా విభజించి, రిజర్వేషన్లు కూడా ఖరారుచేసింది. తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చింది. రాజానగరం, కోరుకొండ మండలాల్లోని గ్రామాలను విలీనానికి దూరం చేసే ప్రయత్నం చేసింది. తర్వాత డివిజన్లను 52గా చేసి రాజమండ్రి రూరల్ మండలంతో పాటు వేమగిరి గ్రామాన్ని కార్పొరేషన్ పరిధిలోకి తెచ్చింది. మళ్లీ కోర్టు లిటిగేషన్లతో సమస్య అలానే మిగిలింది. ఇప్పటికీ ప్రత్యేకాధికారుల పాలనలో కార్పొరేషన్ ఉంది. ఈసారి ఎన్నికలు నిర్వహించడానికే కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. విలీన సమస్య పరిష్కారమైతే 52 డివిజన్లతో మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికలు జరుగుతాయి. రాజానగరం మండలం, కోరుకొండ మండలంలోని పలు గ్రామాలను విలీనం చేస్తే డివిజన్ల సంఖ్య 54 అవుతాయి.

కేబినెట్ ఆమోదం

ఎర్రకాలువ వరద నష్టానికి నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గానికి నిధులు


రాజమహేంద్రవరం,సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది వరద ప్రభావంతో నిడదవోలు, గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో దెబ్బతిన్న ఇరిగేషన్ పనుల పునర్ నిర్మాణం, మరమ్మతుల కోసం నిధులు కేటాయిస్తూ చేసిన ప్రతిపాదనకు గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశం ఆమోదం తెలిపింది. వీటితోపాటు పిఠాపురం, తణుకు, తాడేపల్లిగూడెం పరిధిలో జరిగిన నష్టానికి కూడా నిధులు కేటాయించారు. గోపాలపురం, నిడదవోలు, తాడేపల్లిగూడెం, తణుకు పరిధిలో ఎర్రకాలువ వరద తీవ్ర నష్టం జరిగిన సంగతి తెలిసిందే. దీనిపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ కందుల దుర్గేష్ ఈ పనుల గురించి ప్రభుత్వానికి నివేదించారు. వీటితోపాటు రాష్ట్రంలో మొత్తం 392 పనులకు రూ. 5714.58 లక్షలను మంజూరు చేస్తూ కేబినెట్ ఆమోదం తెలిపినట్టు మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.

నేడు జిల్లాస్థాయి గురుపూజోత్సవ సభ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి గురుపూజోత్సవం శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో శుక్రవారం ఉదయం పది గంటల నుంచి నిర్వహిస్తామని డీఈఓ వాసుదేవరావు తెలిపారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం ఉంటుందన్నారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారన్నారు.

ముస్లింలకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు : ఎస్పీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 4, (ఆంధ్రజ్యోతి): మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. ముస్లింలకు మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు తెలిపారు. మహమ్మద్ ప్రవక్త జీవితం మానవ జాతికి ఆదర్శమన్నారు. సామరస్యం, సోదరభావం, ఇతరుల పట్ల ప్రేమ ప్రవక్త చూపిన మార్గాలని, వాటిలో ప్రజలు నడవాల్సిన అవసరం ఉందని జిల్లా ఎస్పీ అభిలషించారు.


విలేకరులతో మాట్లాడుతున్న అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

జీఎస్టీ రెండు శ్లాబులతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనం : ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ విధానంలో కేంద్ర ప్రభుత్వం సమూలమార్పులు తెస్తోందని, ప్రస్తుతమున్న నాలుగు శ్లాబుల నుంచి రెండు శ్లాబులకు తీసురావడం ఒక చారిత్రాత్మకమైన పరిణామమని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో ఉదయం సోము వీర్రాజు, సాయంత్రం నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఆరోగ్యం, బీమా రంగాలపై జీఎస్టీని పూర్తిగా ఎత్తేశారని, వ్యవసాయ ఉత్పత్తులకు 18 నుంచి 5 శాతానికి, గృహోపకరణాలు 28 నుంచి 18 శాతానికి, నిత్యావసరవస్తువులను 18 నుంచి ఐదుశాతానికి తగ్గించారన్నారు. జీఎస్టీలో సంస్కరణలమూలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 48 వేల కోట్లు ఆదాయం నష్టపోతున్నా ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ప్రజలకు ప్రయోజనమైన కార్యక్రమాలు చేపట్టాలనే లక్ష్యంతో శ్లాబులను కుదించారని అన్నారు. దీనివల్ల పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అన్నారు. రాష్ట్రంలోని రైతులు యూరియా కొరత ప్రధానంగా ఎదుర్కొంటున్నారని, ఈ పరిస్థితిలో 53 వేల టన్నుల యూరియాను కేంద్రం రాష్ట్రానికి కేటాయించిందన్నారు. ఇప్పటికే 10 వేల టన్నులు వచ్చిందని, వారం పదిరోజుల్లో మరో 30 వేల టన్నులు రానున్నాయని అన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


రాహుల్, జగన్‌లది అరాచక ధోరణి..

రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిన పరిస్థితిలో రాహుల్ గాంధీ, జగన్మోహనరెడ్డి అరాచకంగా ప్రవర్తించాలనే ధోరణితో వ్యవహరిస్తున్నారు. వారి ఉనికికే ప్రమాదం ఏర్పడింది అని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. జగన్మోహనరెడ్డి ఇటీవల పులివెందుల వెళితే సందర్శకులకు వీఐపీ పాసులు ఇవ్వడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. మోదీ తల్లిని దూషించిన రాహుల్‌కి మన సంస్కృతిపై గౌరవం లేదనే సంగతి అర్థం చేసుకోవాలని అన్నారు.

బోధన.. విలక్షణంగా..
ఆదర్శంగా నిలుస్తున్న ఉపాధ్యాయులు 4

600 కిలోల గంజాయి పట్టివేత 5

కన్నతండ్రే కాలయముడు


హత్యకు గురైన మోక్షిత, వర్షిణి, శివధర్మ (ఫైల్)

ముగ్గురు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్, నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్నబంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి తన ముగ్గురు పిల్లలనూ పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(38) మేనమరదలు దీపికను 12ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పిల్లల జాడ కోసం సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం సూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హతమారుస్తూ వచ్చినట్లు తేలింది. పురుగులమందు తాగించి చంపి, తర్వాత పెట్రోల్ పోసి దహనం చేశాడని భావిస్తున్నారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు. ప్రకాశం జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందం అచ్చంపేట చేరుకుంది.

లోకం తీరు



కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లకెరె నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి దాడులు నిర్వహించారు. 5విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55కోట్లను జప్తుచేశారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ.2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ ఆర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్గియో ఆర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్గియో ఆర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుది శ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారం గా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జూలై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పనిచేశారు.

ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు బ్రాండ్లు దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీ కంటే ముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో 'హెడ్ ఆఫ్ బ్రాండ్స్'గా పనిచేశారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని తెలిపారు. మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని మాజీ ఆర్థికమంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

» జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని, దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

- » కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
- » ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు
- » తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..
- » తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే
- » సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రులపైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రులపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతోపాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తనపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.


ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్

పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్ కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40 మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పది మంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.

ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. సగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోఢా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్ల చరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

బోధన.. విలక్షణంగా..

బోధన అంటే ఆశువుగా పాఠం చెప్పడమే అనే అర్థం మారిపోయింది. భట్టీపడితే ఈరోజు విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారనుకోవడం భ్రమ. కష్టపడి చదవడం కాదు.. ఇష్టపడి చదవాలనే కాలమిది. పాఠ్యాంశాలను అర్థం చేసుకుని, తమదైన జ్ఞానాన్ని ఆపాదిస్తేనే విద్యకు సరైన పరమార్థం దక్కుతుంది. మరి ఆ మార్గంలో పయనించాలంటే గురువు చేసే దిశానిర్దేశమే కీలకం. అందుకే నేటితరం ఉపాధ్యాయులు బోధనలో కొత్త పద్ధతులను అనుసరిస్తున్నారు. ఏవిధంగా బోధిస్తే విద్యార్థులు అందిపుచ్చుకుంటారనే ఆలోచనతో నిరంతరం ప్రయత్నాలు చేస్తున్నారు. అలాంటి వారిలో కొందరి గురించి..


చిన్నారులకు కృత్యాధార బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్

కృత్యాధార బోధనే ఆయన ప్రత్యేకత

అనపర్తి ఉపాధ్యాయుడు శ్రీనివాస్ వినూత్న బోధన

బోధన అంటే పుస్తకంలోని పాఠాలను పిల్లలకు నూరిపోసేయడమే అనే రోజులు పోయాయి. బట్టీపట్టి పాస్ అయితే పై తరగతులకు వెళ్లాక ఫల్టీ కొట్టడం ఖాయం. దీంతో ఉపాధ్యాయులు బోధించే విషయంలో అనేక వినూత్న పద్ధతులను అనుసరిస్తున్నారు. మరీ ముఖ్యంగా కొందరు ఉపాధ్యాయులు తమదైన శైలిలో బోధన చేస్తూ పాఠ్యాంశాల పట్ల ఎంతో ఆసక్తిని కలిగిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలోని మార్కెండేయపురంలోని మండల పరిషత్ పాఠశాలలో రెండో తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయుడు నీలా శ్రీనివాస్ వినూత్నంగా పాఠాలు బోధిస్తూ అటువంటి ప్రయత్నమే చేస్తున్నారు. అక్కడ పిల్లలు పాఠం వినడం కాదు.. ఆడుతూ పాడుతూ నేర్చుకుంటున్నారంటే అక్కడ బోధన స్పెషాలిటీ అర్థమవుతుంది. డిజిటల్ ఇంటరాక్టివ్ బోర్డు మీద గేమ్స్ ఆడుతూ లెక్కలు చెప్పడం, తెలుగు పదాలను వాక్యాలుగా మార్చడం, ఇంగ్లీషు అక్షరాలను ఓ పాట మాదిరిగా బోధించడం చేస్తున్నారు. 1998లో ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన శ్రీనివాస్ కొత్త పద్ధతుల్లో బోధన చేసేందుకు నిరంతరం తపన పడతారు. దీనిలో భాగమే ఆట- పాట- మాట- కృత్యం. పిల్లలు ఒత్తిడి లేకుండా నేర్చుకోవాలి. పాఠశాల అంటే చిన్నారులకు ఆటస్థలం అనిపించాలి. అందుకే ఈ విధానాన్ని బోధనలో భాగం చేశానంటారు శ్రీనివాస్. ఆటలోనే పాఠం నేర్పడం, పాటల రూపంలో పదాలు, అక్షరాలు చెప్పించడం, మాటలతో చర్చలు, గ్రూప్ వర్క్ చేయించడం, కృత్యం ద్వారా పాఠాన్ని ఆచరణలోకి తీసుకురావడమే తన కర్తవ్యంగా శ్రీనివాస్ బోధిస్తారు. శ్రీనివాస్ అవలంబిస్తున్న విధానాలను తెలుసుకునేందుకు జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు విద్యాశాఖాధికారులు ఆయన పనిచేస్తున్న పాఠశాలను సందర్శించి అభినందిస్తుంటారు. - ఆంధ్రజ్యోతి, అనపర్తి

ఓ అధ్యాపకుడి చేయూత

ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్ అభివృద్ధికి పాల్‌రాజు ప్రత్యేక కృషి



తరగతి గదిలో విద్యాబోధన చేస్తున్న పాల్‌రాజు

గురువంటే విద్యాబోధన చేయడమే కాదు.. తాను పనిచేస్తున్న పాఠశాల అభివృద్ధికి ఆర్థిక చేయూత అందిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేవారూ ఉంటారు. కందుకూరి పాల్‌రాజు కూడా అలాంటి వారిలో ఒకరు. కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్‌లో పాల్‌రాజు జువాలజీ అధ్యాపకునిగా విద్యార్థులకు విద్యాబోధన అందిస్తున్నారు. ఈయన ఏ స్కూల్లో పనిచేసినా విద్యార్థులకు ఆసక్తి కలిగించేలా సరళీకృతంగా పాఠాలు బోధించడం, ఆంగ్లంలో కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం చేస్తుంటారు. ఏపీఎస్పీ హైస్కూల్‌ని గతేడాది ప్రభుత్వం బాలికల హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేసి ఇంటర్మీడియెట్ తరగతులు నిర్వహిస్తోంది. ఇంటర్ కోసం నిర్మించిన అదనపు తరగతుల భవనాలు, గోడలకు పెయింటింగ్స్ లేక విద్యార్థులు అసౌకర్యానికి గురవడాన్ని గుర్తించారు. రూ.30 వేల సొంత డబ్బులతో ఇంటర్ ప్రథమ, ద్వితీయ తరగతి గదులు, మీటింగ్ హాల్, బయట బాల్కనీ గోడలకు పెయింటింగ్స్ వేయించారు. ఇంటర్‌లో అడ్మిషన్ల కోసం పేరెంట్స్ ఇళ్లకు వెళ్లి ఫస్టియర్‌లో ఈ ఏడాది 63 మంది విద్యార్థులు చేరేలా కృషిచేశారు. రెండేళ్లుగా కాలేజీలో అడ్మిషన్ల కోసం రూ.50 వేలు వెచ్చించి ఆటోల ద్వారా ప్రచారం చేయించారు. పాల్‌రాజు ఏమంటున్నారంటే.. కార్పొరేట్ కాలేజీలకు ధీటుగా పరిసరాల పరిశుభ్రత, ఆహ్లాద వాతావరణం, ఆసక్తి కలిగేలా బోధన చేస్తే వారిలో ఉన్న నైపుణ్యాలను వెలికితీసి, మంచి ఫలితాలు సాధించవచ్చు.

- ఆంధ్రజ్యోతి, సర్పవరం జంక్షన్



ఎల్‌డీ పేట ప్రాథమిక పాఠశాలలో నాణేలతో బోధన చేస్తున్న అర్జునరావు మాస్టారు →

అణగనగా ఒక నాణెం..

పురాతన నాణేలతో పాఠం చెబుతూ..

అణా...పరకా.. బేడా ఇవేంటి అనుకొంటున్నారా.. ఇవి మనవాళ్లు వాడిన పురాతన నాణేలు. సుమారు నాలుగు దశాబ్దాల కిందట వరకు చలామణీలో ఉండేవి. ఈ పురాతన నాణేలను సేకరించిన కాకినాడ జిల్లా కోటనందూరు మండలం ఎల్‌డీ పేట ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు వాటితోనే బోధన చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఆయన పేరు పంచాడ అర్జునరావు. ఈ పాఠశాలలో ఆయన ప్రధానోపాధ్యాయుడిగా ఉన్నారు. మన దేశంలో పూర్వం వాడిన నాణేలను సేకరించడం చాలామంది చేస్తుంటారు. అలాగే వివిధ దేశాల కరెన్సీని, గాంధీజయంతి నాడు ముద్రించిన ప్రత్యేక నోట్లను సేకరించడం మరికొందరి హాబీ. అర్జునరావు మాస్టారు 2002 నుంచి విద్యార్థులకు ద్రవ్యం గురించి పాఠశాలు చెప్పడం కోసం నాణేల సేకరణ చేయడం ప్రారంభించారు. రెండు దశాబ్దాలకు పైగా కోటనందూరు, పాతకొట్టాం, కొత్తకొట్టాం, ఎల్‌డీపేట పాఠశాలల్లోని విద్యార్థులకు ఇలాంటి నాణేలతో బోధించడం అందరికీ సుపరిచితమే. పూర్వం నుంచి ఉన్న నాణేలతో ద్రవ్య చరిత్ర వివరించడం, పాత నోట్లు ఎలా చలామణీ అయ్యాయో సవివరంగా తెలియజెప్పడం చేస్తుంటానని అర్జునరావు చెప్పారు.

- ఆంధ్రజ్యోతి, కోటనందూరు



మొక్కల సంరక్షణను వివరిస్తున్న టీచర్ విష్ణుప్రియ.. లెర్నింగ్ మెటీరియల్‌తో పాఠాలు బోధిస్తున్న దృశ్యం

'నేచురల్' స్టడీ

వినూత్న విద్యాబోధన ఆమె ప్రత్యేకత

లెర్నింగ్ మెటీరియల్‌తో పాఠాలు

పాఠశాల మైదానంలో జీవశాస్త్ర ప్రయోగాలు

విద్యార్థులకు వినూత్న రీతిలో పాఠాలు చెప్పేందుకు ప్రయత్నిస్తుంటారు కొందరు ఉపాధ్యాయులు. ఎలా చెబితే విద్యార్థుల బుర్రల్లోకి విషయం చేరుతుందో ఆ విధంగా విద్యా బోధన చేసేందుకు తపన పడుతుంటారు. కేవలం తరగతి గదిలో క్లాసులు చెప్పడమే కాదు.. పుస్తకాల్లోని అంశాలను ప్రాక్టికల్‌గా చేసి చూపడం కొందరి ఉపాధ్యాయుల ప్రత్యేకత.. అలాంటి వారిలో బొల్లు విష్ణుప్రియ కూడా ఒకరు. ప్రస్తుతం శ్రీనగర్ మున్సిపల్ హైస్కూల్లో (ఇంగ్లిష్ మీడియం) ఆమె ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు బయాలాజికల్ సైన్స్ సబ్జెక్టును బోధిస్తున్నారు. 15 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న విష్ణుప్రియ కాకినాడ రమణయ్యపేట, గొడారిగుంట మున్సిపల్ హైస్కూళ్లల్లోనూ పనిచేశారు. టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌తో పాఠాలు బోధిస్తూ.. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. జీవం, జీవుల శాస్త్రీయ అధ్యయనం, వాటి నిర్మాణం, పనితీరు, పెరుగుదల, మూలం, పరిణామం జీవావరణ శాస్త్రం, జంతు, వృక్ష, జీవ రసాయన శాస్త్రాలు, బయోటెక్నాలజీ, సూక్ష్మ జీవశాస్త్రం వంటి అనేక అంశాలను ప్రయోగాత్మకంగా చేసి చూపిస్తూ విద్యార్థులకు తరగతి గదిలోనే కాదు.. స్కూలు ఆవరణలోనూ పాఠ్యాంశాలు బోధిస్తున్నారు. అంతేకాదు పర్యావరణ పరిరక్షణకు పెద్ద పీట వేస్తూ విద్యార్థులతో స్వయంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించారు. వాటి సంరక్షణ బాధ్యతలను కూడా వారే చేపట్టేలా విద్యార్థుల్లో చైతన్యం తీసుకొస్తున్నారు. తాను ఏ పాఠశాలలో పనిచేసినా బయాలాజికల్ సైన్స్‌లో విద్యార్థులు అధిక మార్కులు తెచ్చుకోవడంలో ఆమె కృషి చేస్తున్నారు. తరగతి గదిలో ఏ పాఠం చెప్పబోతున్నారో ఆ పాఠ్యాంశానికి సంబంధించిన లెర్నింగ్ మెటీరియల్‌ను ముందుగానే సిద్ధం చేసుకుని అందరికీ అర్థమయ్యే రీతిలో ప్రాక్టికల్‌గా విషయ పరిజ్ఞానాన్ని వివరించడం విష్ణుప్రియ ప్రత్యేకత.

- ఆంధ్రజ్యోతి, కాకినాడ




భట్లపాలెం ప్రాథమిక పాఠశాలలో కొడుకు మోహిత్‌సూర్య నోటు పుస్తకాన్ని పరిశీలిస్తున్న ఉపాధ్యాయుడైన తండ్రి నాగేంద్రగౌడ్.. రాజుపైరు పాఠశాలలో పిల్లలు కార్తీక, హారికలతో ఉపాధ్యాయుడైన తండ్రి సూర్యనారాయణ.. సత్యానందరావు, యజ్ఞకుమారి దంపతుల పిల్లలు శ్రీనందన, శ్రీనందకుమార్

ఆదర్శ ఉపాధ్యాయులు!

పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తూ..

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదివించుకుంటున్నారని విమర్శలు ఎన్నో ఉన్నాయి. అందుకు భిన్నంగా వీరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించారు. అమలాపురంరూరల్ మండలం ఇందుపల్లి శివారు భట్లపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కొవ్విల వెంకట నాగేంద్రగౌడ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తన కుమారుడైన శ్రీమోహిత్‌సూర్యను అదే పాఠశాలలో చేర్పించి ఐదో తరగతి విద్యార్థులతో కలిపి ఆయనే పాఠాలు చెబుతున్నారు. ఇక రాజుపైరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కుంచెం సూర్యనారాయణ ఉపాధ్యాయుడు. అదే పాఠశాలలో ఆయన పెద్ద కుమార్తె సత్యకృష్ణకార్తీక 4వ తరగతి, హారిక 2వ తరగతి చదువుతున్నారు. ఏకోపాధ్యాయ పాఠశాల కావడంతో మిగిలిన పిల్లలతో కలిసి తన కుమార్తెలకు ఆయనే పాఠాలు చెబుతున్నారు. అమలాపురం రూరల్ మండలం బండారులంకకు చెందిన బళ్ల సత్యానందరావు, ములికి యజ్ఞకుమారి దంపతులిద్దరూ ఉపాధ్యాయులే. యజ్ఞకుమారి ప్రస్తుతం రావులచెరువు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయిని. ఇక సత్యానందరావు తాను ఎనిమిదేళ్లపాటు బండారులంక వల్లూరివారిపేట ప్రాథమిక పాఠశాలలో పనిచేశారు. కుమార్తె లక్ష్మీవిశాల శ్రీనందన, కుమారుడు విజయ్‌శ్రీనందకుమార్‌లకు 5వ తరగతి వరకు తాను పనిచేసిన పాఠశాలలోనే చేర్పించి చదివించారు. అదే గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పిల్లలిద్దరు 8వ తరగతి చదివారు. వారిద్దరు ప్రస్తుతం పెద్దాపురం నవోదయ పాఠశాలలో చదువుకుంటున్నారు. - ఆంధ్రజ్యోతి, అమలాపురం రూరల్


గురుభ్యో నమః


డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పెయింటింగ్ చిత్రం

అమలాపురం రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఏటా సెప్టెంబరు 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటాం. ఆయన ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించి రాష్ట్రపతిగా ఎంతో ఉన్నత స్థానానికి ఎదిగారు. దీనిలో భాగంగా పాలగుమ్మి జడ్పీ హైస్కూల్‌కు చెందిన చిత్రలేఖనం ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహచంద్ర కుమార్ తన అభిమానాన్ని చాటుకుంటూ వినూత్నంగా బ్లాక్ షీట్‌పై తెలుగు రంగు మాత్రమే ఉపయోగించి రాధాకృష్ణన్ చిత్రపటాన్ని గీశారు. ఆ చిత్రం విశేషంగా ఆకట్టుకుంటోంది.

ఆవగింజలతో సర్వేపల్లి చిత్రం

- 2025 గింజలను ఉపయోగించి తయారు చేసిన రాజారావు




రాజారావు, చిత్రకారుడు

ఆలమూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవంలో భాగంగా మాజీ రాష్ట్రపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రాన్ని ఆవగింజలతో తయారుచేశారు. ఆలమూరు మండలం కొత్తూరు శ్రీవిద్యా పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న యర్లగడ్డ రాజారావు మూడురోజుల పాటు శ్రమించి 2025 ఆవగింజలను ఉపయోగించారు. ఈయన అనేక మంది ప్రముఖుల చిత్రపటాలను తయారు చేయడంలో నేర్పరి. అతన్ని పలువురు అభినందించారు.

తెలుగు టీచర్ సృజన .. అక్షర రూపంలో


అక్షర రూపంలో గీసిన చిత్రపటం

రాయవరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీచర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాన్ని అక్షర రూపంలో గీసి రాయవరం మండలం వెదురుపాకకి చెందిన తెలుగు టీచర్ డాక్టర్ చిర్రా వెంకట మోహన్ అభిమానాన్ని చాటుకున్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాధాకృష్ణన్ జననం, బాల్యం, విద్యాభ్యాసం, పదవులు, పురస్కారాలు, బిరుదులు, తదితర అంశాలను ఈ చిత్రపటంలో పొందిపర్చానని చెప్పారు. ఆయన జయంతి సందర్భంగా నివాళి అర్పించినట్టు చెప్పారు.

600 కిలోల గంజాయి పట్టివేత


తాళ్లపూడి పోలీస్ స్టేషన్ వద్ద గంజాయి ప్యాకెట్లను పరిశీలిస్తున్న పోలీసులు

తాళ్లపూడి, సెప్టెంబరు 4 (ఆంధ్రజోతి): తాళ్లపూడి మండలం మలకపల్లి వద్ద గురువారం 600 కిలోల గంజాయిను పోలీసులు పట్టుకున్నారు. విశాఖ జోనల్ యూనిట్ నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) అధికారులకు టీఎన్69 ఏఎం 4777 నెంబర్ గల ఇన్నోవా వాహనంలో గంజాయి వస్తుందనే సమాచారం అందడంతో వెంబడించారు. దీంతో కొవ్వూరు టోల్‌గేటు వద్దకు వచ్చేసరికి నిందితులు తప్పించుకుని పారిపోతుండగా మలకపల్లి వద్ద పోలీసులు అటకాయించారు. గంజాయిని తరలిస్తున్న వారిలో ఇద్దరు కారు దిగి పారిపోగా, పట్టుబడ్డ మహరాజన్ రాజాను విచారణ నిమిత్తం తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. కాగా, కారును పరిశీలించగా మొత్తం 292 గంజాయి ప్యాకెట్లు లభ్యమవగా, వాటి విలువ రూ. మూడు కోట్ల వరకు ఉండొచ్చని అధికారులు గుర్తించారు. ఈ మేరకు నిందితుడ్ని, వాహనాన్ని రాజమహేంద్రవరం తరలించి, అక్కడ పూర్తి సమాచారం అందిస్తామని నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అధికారులు పేర్కొన్నారు.

నారసింహా... పాహిమాం

- అంతర్వేది పుణ్యక్షేత్రంలో ఘనంగా ముగిసిన పవిత్రోత్సవాలు
- స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు


ఆలయంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు


ప్రత్యేక పవిత్రాల అలంకరణలో స్వామి-అమ్మవార్లు


స్వామివారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

అంతర్వేది, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి):నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది పుణ్యక్షేత్రంలో స్వయంభూగా వెలిసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామివారి ఆలయంలో గత నాలుగు రోజులుగా స్వామివారి పవిత్రోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. గురువారం ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలను అర్చకులు నిర్వహించారు. పూర్ణాహుతితో స్వామివారి పవిత్రోత్సవాలు పరిపూర్ణమయ్యాయి. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, అభిషేకం, అలంకార తిరుమంజనం, ప్రాయశ్చిత హోమం, మహాశాంతి హోమం, పరమాత్మికోపనిషత్తు, శేష హోమం, 12 గంటలకు పూర్ణాహుతి పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. సాయంత్రం కంచు గరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం గ్రామ పురవీధుల్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. పవిత్ర అవరోహరణ, విశేషార్చన, నీరాజన మంత్రపుష్పాలు, పవిత్రముల వినియోగం జరిగింది. ఆలయమంతా భక్తులతో కిటకిటలాడడంతో అన్నదానంలో అధిక సంఖ్యలోభక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజాకలిదిండి కుమారరామగోపాలరాజాబహదూర్, ఆలయ ఏసీ ఎంకేటీఎన్వీ ప్రసాద్, అహోబిలం దేవస్థాన సభ్యులు, జంపన బుజ్జిరాజు, మధురాజు, చంటిరాజు, నల్లా ప్రసాద్, పోతురాజు శ్రీవెంకటకృష్ణ, గొట్టుముక్కల భీమరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు వీరికే..

దివాన్‌చెరువు, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్ పీ.ఉమామహేశ్వరిదేవి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 2025కు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ గురువారం తెలిపారు. దీనికి సంబంధించి ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జరిగే కార్యక్రమంలో సీఎం నుంచి ఉమామహేశ్వరిదేవి అవార్డు అందుకుంటారని తెలిపారు. నన్నయలో ఆమె మేనేజ్‌మెంట్ ఆచార్యులుగా విధులు నిర్వహిస్తూ విశ్వవిద్యాలయం అడ్మిషన్స్ డైరెక్టర్‌గా, ఉమెన్‌సెల్ కోఆర్డినేటర్‌గా సేవలందిస్తున్నారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి, ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి, విభాగాధిపతి ఆచార్య ఎన్.ఉదయభాస్కర్ తదితరులు ఉమామహేశ్వరీదేవికి అభినందనలు తెలిపారు.

ఇద్దరు పీఆర్ అధ్యాపకులకు..

కాకినాడరూరల్: కాకినాడ పీఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల్లో అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న ఇద్దరు అధ్యాపకులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ పురస్కారాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కందుల ఆంజనేయులు తెలిపారు. కళాశాల కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన డాక్టర్ కె.లక్ష్మణ్, అదేవిధంగా భౌతికశాస్త్ర విభాగానికి చెందిన డాక్టర్ కెజయదేవ్ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికయ్యారన్నారు. విజయవాడలోని ఏ1 కన్వెన్షన్‌లో శుక్రవారం జరిగే గురుపూజోత్సవ వేడుకల్లో సీఎం నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నుంచి అవార్డులను అందుకోనున్నారు.

రాజమహేంద్రవరం కల్చరల్: రాజమహేంద్రవరంలోని శ్రీ కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలలో సంస్కృత ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న పీ.శ్రీవల్లి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. రాజమండ్రి వాస్తవ్యురాలైన శ్రీవల్లి 2011 నుంచి సంస్కృత ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ ... ప్రస్తుతం కళాశాల వైస్ ప్రిన్సిపాల్, అకడమిక్ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తున్నారు. 2001లో ఆంధ్రా యూనివర్సిటీ నుంచి ఎంఏ సంస్కృతం పట్టా, 2009లో తిరుపతి ఆర్ఎస్ విద్యాపీఠం నుంచి సంస్కృతంలో పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. విశాఖపట్నం ఆల్ ఇండియా రేడియో నుంచి విద్యార్థులకు సంస్కృతంలో తరగతులు నిర్వహిస్తున్నారు.

పవన్ ఉపాధ్యాయ దినోత్సవ కానుక

- రెండువేల మంది ప్రభుత్వ, ప్రైవేట్ టీచర్లకు చీరలు, ప్యాంట్లు, షర్టులు


టీచర్లకు కానుకలను అందజేస్తున్న డిప్యూటీ సీఎం పేషీ అధికారులు

పిఠాపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన కానుకతో ఉపాధ్యాయలోకం మురిసిపోయింది. వివరాల్లోకి వెళితే.. పిఠాపురం నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న రెండు వేల మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులకు తన ఓఎస్‌డీలు, పేషీ అధికారుల ద్వారా పవన్ దుస్తులు పంపించారు. వీటిని విద్యార్థుల చేతులమీదుగా వారికి అందజేయించారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో గల అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, కళాశాలల్లోని అధ్యాపకులకు ఒకరోజు ముందే ఉపాధ్యాయ దినోత్సవం వచ్చినట్టయ్యింది. వీరందరికీ పవన్ ప్రత్యేకంగా కానుకలు పంపారు. గురువారం ఉదయమే డిప్యూటీ సీఎం పేషీ అధికారులు వీటిని తీసుకుని నియోజకవర్గానికి వచ్చారు. మహిళా ఉపాధ్యాయులకు చీరలు, పురుషులకు ప్యాంట్లు, షర్టులు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పేషీ అధికారులు శివకుమార్, నాగబాబు, శ్రీనివాస్, గొల్లప్రోలు, పిఠాపురం ఎంఈవోలు వెంకట శివప్రసాద్, శ్యామ్‌బాబు, నారాయణదాసు, హెచ్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

గణేశుడి నిమజ్జనాల్లో ఘర్షణలు

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం బీ.కొత్తూరులో గురువారం జరిగిన వినాయక నిమజ్జనం ఘర్షణకు దారి తీసింది. బాణసంచా కాల్చే సమయంలో నిప్పు రవ్వలు కొందరిపై పడ్డాయి. దీంతో అదే సమయంలో అన్నదానం జరుగుతుండటం వల్ల ఇరువర్గాలు వాగ్వావాదానికి దిగాయి.అది చిలికిచిలికి గాలివానలా మారి తీవ్రమై ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణలో ఒక వర్గానికి చెందిన చెల్లి గణేష్, బాబీ, చంటమ్మకు, మరో వర్గానికి చెందిన చినబాబు, మాగాపు శ్రీనుకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం పిఠాపురం, కాకినాడ ప్రభుత్వాసుపత్రులకు తరలించారు. పిఠాపురం రూరల్ పోలీసులకు ఇరువర్గాలు పరస్పరం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

అల్లవరం: కొమరగిరిపట్నం గుర్రంవారి వీధి గణేష్ నిమజ్జన ఊరేగింపులో గురువారం రాత్రి అపశృతి చోటుచేసుకుంది. ఓ యువకుడు కత్తితో పొడవగా ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఉప్పలగుప్తం మండలం చీకట్లపాలేనికి చెందిన యువకుడు కత్తితో పొడవగా కొమరగిరిపట్నానికి చెందిన సుంకర రమేష్, కొమ్మూరి శంకర్ గాయపడినట్టు సమాచారం. విషయం తెలుసుకున్న అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ బీసంపత్‌కుమార్ హుటాహుటిన వచ్చి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఉద్రిక్త పరిస్థితుల నడుమ ఊరేగింపు అర్ధంతరంగా ఆగిపోయింది. సీఐ ఆదేశాల మేరకు కొమరగిరిపట్నంలో పోలీసు పికెట్‌ను ఏర్పాటుచేశారు.

రైస్ పుల్లింగ్ ముఠా గుట్టురట్టు

- కాకినాడలో పురాతన నాణేల పేరుతో ఘరానా మోసం
- ఐదుగురు నిందితుల అరెస్ట్
- నకిలీ ప్రాచీన నాణాలు, ప్లేటు, ధ్రువ పత్రాలు, రబ్బరు స్టాంపులు స్వాధీనం
- ఎస్పీ బిందుమాధవ్


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ బిందుమాధవ్


స్వాధీనం చేసుకున్న నకిలీ వస్తువులు

కాకినాడ క్రైం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన కాలంనాటి అతి విలువైన, అరుదైన వస్తువులు, పురాతన అంతర్జాతీయ నాణాలు ఉన్నాయని వాటిని అమ్మితే బయట మార్కెట్‌లో ధర కోట్లలో ఉంటుందని అమాయక ప్రజలను నమ్మించి ధనార్జన చేస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను కాకినాడ టూటౌన్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ జి.బిందుమాధవ్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బుధవారం రాత్రి పెట్రోలింగ్ చేస్తుండగా కాకినాడ, గాంధీనగర్ పార్క్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. కాకినాడ సూర్యనారాయణపురానికి చెందిన షేక్ సర్దార్ అలియాస్ గుణ అలియాస్ గుణశేఖర్, అలియాస్ మహేశ్వరరెడ్డి, రామారావు పేటకు చెంది న పడాల వెంకటరమణ, విశాఖపట్నానికి చెందిన దువ్వు రాజశేఖర్, పశ్చిమగోదావరి జిల్లా నరసాపురానికి చెందిన జమ్ము లక్ష్మీదుర్గ, తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం రామవరం గ్రామానికి చెందిన కండవల్లి శ్రీనులుగా గుర్తించారు. ఈ ఐదుగురు మధ్యతరగతి చెందిన అమాయకులను ఎంచుకుని వారి వద్దకు వెళ్లి తమకు అమృత ట్రస్ట్ అనే అనాథ శరణాలయం ఉందని, దాని నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వస్తాయని, వాటిని పేద విద్యార్థులకు, వృద్ధులకు, రోగులకు, అనాథలకు ఆన్‌లైన్ అకౌంట్స్ తెరచి కొంత డబ్బును ప్రజలకు ఇస్తామని నమ్మించే వారు.అయితే ప్రాచీన, విలువైన, అరుదైన వస్తువులు తమ వద్ద ఉన్నాయని, వాటిని బహిరంగ మార్కెట్లో అమ్మితే కోట్లలో డబ్బులు వస్తాయని, వాటిని కొనుగోలు చేస్తే తక్కువ రేటుకు పురాతన వస్తువులు రావడంతో పాటు తమ ద్వారా పేదలకు, అనాథలకు సహాయం చేసిన వారవుతారని నమ్మించి సొమ్ములు కాజేసేవారు. అయితే వీరు ప్రాచీన నాణాలు, ప్లేట్లు నకిలీవి తయారు చేయించే వారు. వాటికి లేపనం చేసి నిజమైన వాటిగా రైస్ పుల్లింగ్ పరీక్షను, నీడిల్ పరీక్షను, ఉజాల పరీక్షను చేశారు. వాటిని అమ్మడానికి వారే పార్టీలను రప్పించేవారు.వారి వద్ద అమాయక ప్రజలతో కొనుగోలు చేయించి సొమ్ములు కాజేసేవారన్నారు.షేక్ సర్దార్ అమృత ట్రస్ట్ మేనేజర్‌గా, దువ్వు రాజశేఖర్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌గా, కండవల్లి శ్రీను సెకండ్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్‌గా వ్యవహరిస్తూ తప్పుడు పత్రాలను సృష్టించి, వారి హోదాలకు సంబంధించి స్టాంప్స్‌ను తయారు చేసి ప్రజలను నమ్మించే వారు. ప్రజలకు ఆన్‌లైన్‌లో అకౌంట్స్ ఓపెన్ చేస్తామని ఒక్కో అకౌంట్‌కు రూ.13 వేలు వసూలు చేసి ట్రస్ట్ నుంచి కోట్ల రూపాయలు ఆ అకౌంట్స్‌లో పడతాయని చెప్పేవారు. వచ్చిన నగదును బ్యాగ్‌లలో భద్రపర్చి ఓ ఇంట్లో తాళం వేసి అమౌంట్ ప్రాసెసింగ్‌లో ఉందని నమ్మించి బ్యాగ్‌లు ఓపెన్ చేయనీయకుండా, అకౌంట్స్ ఇంకా ప్రాసెసింగ్‌లో ఉన్నాయని, కొంత డబ్బు అవసరమని నమ్మించి ప్రజల నుంచి నేరుగా జమ్ము లక్ష్మీదుర్గ అకౌంట్‌కు డబ్బులు వేయించుకుని మోసం చేసేవారు. నిందితుల వద్ద నుంచి 6 నకిలీ ప్రాచీన నాణాలు, ఒక నకిలీ ప్రాచీన ప్లేటు, 4 నకిలీ ధ్రువపత్రాలు, 2 నకిలీ రబ్బరు స్టాంపులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ పేర్కొన్నారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు, క్రైం సీఐ వి.కృష్ణ బృందాలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కాకినాడ ఎస్‌డీపీవో పాటిల్ దేవరాజ్ మనీష్, ఎస్పీ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్‌గా రమణ


జీవీ రమణను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాకా రమణగా సుప్రసిద్ధులైన, రాజమహేంద్రవరం ఆర్ట్స్ క్రియేటివ్ కల్చరల్ అసోసియేషన్(రాకా) కార్యదర్శి జీవీ రమణ, ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు 25మందితో పాలక వర్గ జాబితాను ప్రభుత్వం గురువారం ప్రకటించింది. ఇరిగేషన్ శాఖలో ఉద్యోగిగా పనిచేసి ఆ తరువాత రాకా సాంస్కృతిక సంస్థ స్థాపనలో కీలక పాత్ర వహించారు. అధ్యక్షుడిగా ప్రముఖ వైద్యుడు కంటే వీరన్నచౌదరి, తాను కార్యదర్శిగా పలు సాంస్కృతిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. 1987 ఆకాశవాణి కేంద్రంలో డ్రామా ఆర్టిస్ట్‌గా ఎంపికై పలు రేడియో నాటికలు వేయడంతో పాటు రంగస్థలం మీద కూడా ఇండియా ఫర్ సేల్, దేశంలో దొంగలు పడ్డారు లాంటి పలు నాటికలు, సామాజిక స్పృహ కలిగిన రేడియో నాటికలు రాసారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో ఆయనకు ఉన్న అనుబంధం విడదీయరానిది. ఔత్సాహిక గాయకుడిగా పలు గీతాలు ఆలపించారు. 2019లో ధవళేశ్వరంలో పద్మశ్రీ ఘంటసాల విగ్రహ స్థాపనకు కృషి చేశారు. ఇటీవల ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటు చేయించారు. స్థానిక గోకవరం బస్టాండ్ సమీపంలోని వీరన్నచౌదరి హాస్పిటల్ ఆవరణలోని బాలు స్మారక మందిరంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమణ మాట్లాడుతూ నాటక అకాడమీ తరపున చేయాల్సిన కార్యక్రమాలను చిత్తశుద్ధితో చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు సత్కరించారు. కార్యక్రమంలో తిరుమల కృష్ణమోహన్, సూరపరెడ్డి తాతారావు, భమిడిపాటి రామకృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రాణం తీసిన ఆన్‌లైన్ బెట్టింగ్

వైపీ పాలెంలో యువకుడి ఆత్మహత్య


తేరం సాయి(ఫైల్)

పి.గన్నవరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లో డబ్బును పోగొట్టి.. భయంతో 19 ఏళ్ల యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం వైపీ పాలెంలో జరిగింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తేరం శ్రీనివాసరావు జీవనోపాధి నిమిత్తం ఆటోను కొనేందుకు ఇంట్లో ఉన్న బంగారాన్ని ఈ నెల 1న స్థానిక ప్రైవేటు ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టారు. తాకట్టులో వచ్చిన రూ.1.25 లక్షల సొమ్మును తన కుమారుడు సాయి ఖాతాలోకి జమ చేయించాడు. అయితే ఆన్‌లైన్ బెట్టింగ్‌లో ఉన్న సాయి తన ఖాతాలో ఉన్న సొమ్ము బెట్టింగ్‌లో పోగొట్టాడు. దీంతో తండ్రి మందలిస్తాడెమోనన్న భయంతో అదే రోజు మధ్యాహ్నం ఏటిగట్టుపైకి వెళ్లి పురుగులు మందు తాగేశాడు. చావు భయంతో బెట్టింగ్ విషయం, పురుగులు మందు తాగిన విషయం ఫోన్‌లో తన తండ్రికి, స్నేహితులకు వివరించాడు. దీంతో వారు హుటాహుటిన సాయి ఉన్న ప్రదేశానికి చేరుకుని తొలుత కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి అక్కడ నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం రావులపాలెం అక్కడ నుంచి అమలాపురం తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం తెల్లావారుజామున మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మృతుడు మేనమామ దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు.

రేపటి నుంచి అమెరికామెడీ నాటికలు

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, ది యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 6, 7 తేదీల్లో కాకినాడ దంటు కళాక్షేత్రంలో అమెరికామెడీ నాటికలు ప్రదర్శించనున్నారు. అమెరికా హాస్యబ్రహ్మ వంగూరి చిట్టెన్ రాజు రచించిన ఐదు హాస్య నాటికల బ్రోచర్‌ను ప్రముఖ రచయిత, యూట్యూబర్ రవి మంత్రి గురువారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొంటున్న ప్రముఖ నటుడు, రచయిత తనికెళ్ల భరణికి జీవన సాఫల్య పురస్కారం ప్రదానం చేయనున్నట్టు వంగూరి ఫౌండేషన్ అధ్యక్షుడు చిట్టెన్ రాజు తెలిపారు. నాటక రంగ నిపుణులు ఆచార్య బీవీ రమణమూర్తి, ఆచార్య డీఎస్ఎన్ మూర్తిలకు ఆత్మీయ సత్కారం చేయనున్నట్టు దంటు భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో మార్ని జానకిరామచౌదరి, ప్రభుదాసు,కట్టా కృష్ణారావు, బాలాంత్రపు సుచిత్రామూర్తి పాల్గొన్నారు.

ట్రాక్టరు తిరగబడి కూలీ మృతి


ప్రమాదంలో మృతిచెందిన గోవిందు



ముమ్మిడివరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఐరన్ ఊసల లోడుతో వెళుతున్న ట్రాక్టరు ట్రక్కు తిరగబడడంతో ఆ ట్రాక్టరుపై ఉన్న వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన ముమ్మిడివరం మండలం అయినాపురం ఏటిగట్టుపై గురువారం జరిగింది. అయినాపురం ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయం నుంచి మురమళ్ల ట్రాక్టరు ట్రక్కుపై ఇనుప ఊసలు తరలిస్తుండగా ట్రక్కుపై యానాం వెంకటన్‌నగర్ శివారు కురసంపేటకు చెందిన కూలీ మేడిశెట్టి గోవిందు (48) కూర్చొన్నాడు. ఏటిగట్టుపై వెళుతుండగా ట్రాక్టరుకు సడన్ బ్రేక్ వేయడంతో ట్రక్కు అదుపు తప్పి బోల్తా కొట్టింది. ట్రక్కుపై ఉన్న గోవిందు కింద పడగా అతనిపై ఇనుప ఊచలు పడిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. కాగా గోవిందుకు భార్య రమాదేవి, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గోవిందు కూలీ పని చేసుకుని కుటుంబాన్ని పోషిస్తుంటాడు. గోవిందు మృతితో ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నాటు తుపాకీతో వ్యక్తి అరెస్ట్

గోకవరం, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): నాటు తుపాకి కలిగి ఉన్న వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసినట్టు గోకవరం ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. గోకవరం మండలం జగన్నాథపురం శివారున ఉన్న కోళ్ల ఫారమ్‌లో ఒక వ్యక్తి నాటు తుపాకీ కలిగి ఉన్నాడని తిరుమలాయపాలెం ఫారెస్ట్ సెక్షన్ అధికారి అమలదాసు భాస్కరకృష్ణ ఫిర్యాదు చేశారన్నారు. దర్యాప్తులో భాగంగా తుపాకీ కలిగిన యమల నాగబాబు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండు నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

అద్దంపల్లి - యర్రపోతవరం రోడ్డులో దోపిడీ

వ్యక్తిని గాయపరచి బంగారం, నగదు, స్కూటీ పట్టుకుపోయిన దొంగలు

కె.గంగవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అద్దంపల్లి-యర్రపోతవరం రోడ్డు లో బుధవారం రాత్రి దోపిడీ జరిగిందని ఎస్.ఐ ఎస్‌కే జానీబాషా చెప్పారు. ద్రాక్షారామ గ్రామా నికి చెందిన దినేష్‌కు ద్రాక్షారామ, యానాంలో తాకట్టు, బంగారం విక్రయ దుకాణాలున్నాయి. అతడి వద్ద పనిచేసే యండమూరి శ్రీనివాసు యానాంలోని షాపును నిర్వహిస్తున్నాడు. శ్రీని వాసు ద్రాక్షారామ నుంచి రోజూ యానాం వెళ్లి వ్యాపారం చూసుకుని రాత్రి ఇంటికి తిరిగి వస్తుంటాడు. వచ్చేటప్పుడు యానాం షాపులో పనిచేస్తున్న అద్దంపల్లికి చెందిన విశ్వనాధం బుల్లియ్యను అద్దంపల్లిలో దింపి ద్రాక్షారామ వెళ తుంటాడు. ఈ క్రమంలో బుధవారం అద్దంపల్లి నుంచి యర్రపోతవరం వస్తుండగా ఆటోలో వ చ్చిన దుండగులు శ్రీనివాసును గాయపరచి 12 గ్రాముల బంగారం, రూ.5 వేలు రొక్కం, స్కూ టీ, పద్దుల పుస్తకాలు పట్టుకుని వెళ్లిపోయారు. దీనిపై శ్రీనివాసు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

యూరియా కొరత లేదు

రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణ నాయక్.. రాజానగరంలో ఎరువుల నిల్వల పరిశీలన


రాజానగరంలో ఎరువుల నిల్వలను తనిఖీ చేస్తున్న ఆర్డీవో కృష్ణ నాయక్

రాజానగరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాజానగరం మండల పరిధిలో యూరియా కొరత లేదని రాజమహేంద్రవరం ఆర్డీవో కృష్ణ నాయక్ స్పష్టం చేశారు. రాజానగరం, తోకాడ గ్రామాల్లోని సొసైటీల వద్ద ఎరువుల నిల్వలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రస్తుతం యూరియా నిల్వ 19.62 మెట్రిక్ టన్నులు ఉండగా రైతు సేవా కేంద్రాల్లో(ఆర్ఎస్‌కేఎస్) అదనంగా 2.20 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. రైతులకు యూరియా సరఫరాలో ఎలాంటి జాప్యం తలెత్తకుండా ఉండేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించామన్నారు. ఎరువుల పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా నేరుగా తమకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవో ఎ.కళ్యాణ్ సూర్యకుమార్, డీటీ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

సహజ వనరుల రక్షణను బలోపేతం చేయాలి

ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ పురుషోత్తం కుమార్

దివాన్‌చెరువు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సహజ వనరుల రక్షణను బలోపేతం చేయడానికి జ్ఞానాన్ని పంచుకోవడంలో అకాడమీల మధ్య సహకారం ఎంతో ప్రాముఖ్యమైందని ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ పురుషోత్తంకుమార్ అన్నారు. దివాన్‌చెరువులోని రాష్ట్ర అటవీ అకాడమీలో ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ, రాష్ట్ర అటవీ అకాడమీ అడవులు, వన్యప్రాణులలో న్యాయ వ్యవస్థ పాత్ర అనే అంశంపై గురువారం వర్క్ షాప్ నిర్వహించారు. ఈవర్క్ షాప్‌లో పురుషోత్తంకుమార్ పాల్గొని మాట్లాడారు. తూర్పుగోదావరి జిల్లా ప్రిన్సిపాల్ జిల్లా న్యాయమూర్తి జి.సునీత పలు విషయాలను వివరించారు. అటవీ అకాడమీ డైరెక్టర్ బి.విజయకుమార్ మాట్లాడుతూ అడవులు, వన్యప్రాణుల సంరక్షణలో న్యాయ వ్యవస్థ పాత్రపై కేస్ స్టడీస్, న్యాయ పరమైన క్రియాశీలతను వివరించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం సీసీఎఫ్ బీఎస్ఎన్ మూర్తి, ఎర్ర చందనం రక్షణ సమస్యలపై చర్చించారు. అటవీ సంరక్షణాధికారి ఎస్.నాగేశ్వరరావు అటవీ సంరక్షణా చట్టం-1980 ఆంధ్రప్రదేశ్ అటవీ చట్టం-1967పై అంతరార్థాలను పంచుకున్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ జ్యుడీషియల్ అకాడమీ నుంచి 80 మంది న్యాయాధికారులు, నలుగురు అధికారులు పాల్గొన్నారు.

10న రెడ్ రన్ మారథాన్

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కల్పించడానికి ఈనెల 10వ తేదీన రాజమహేంద్రవరంలో రెడ్ రన్ మారథాన్(5 కిలోమీటర్ల) కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ నియంత్రణ అధికారిణి డాక్టర్ ఎస్.వసుంధర తెలిపారు. గురువారం జిల్లా డీఏఎల్‌టీ కార్యాలయంలో సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వసుంధర మాట్లాడుతూ జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ కార్యాలయం ఆధ్వర్యంలో ఆ రోజు ఉదయం 6 గంటలకు స్థానిక వై.జంక్షన్ నుంచి ఇస్కాన్ ఆలయం వరకూ మారథాన్ నిర్వహిస్తామని తెలిపారు. కలెక్టర్, ఇతర అధికారులు ఈ రెడ్ రన్ మారథాన్‌లో పాల్గొంటారని, ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. రెడ్ రన్ కార్యక్రమం ద్వారా ఎయిడ్స్‌పై ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం జరుగుతుందని, కాలేజీ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్, ఆర్ఆర్‌సీ వలంటీర్లు పాల్గొని ప్రజలకు అవగాహన సందేశం అందిస్తారని ఆమె పేర్కొన్నారు.

కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు

ఎమ్మెల్సీ సోము వీర్రాజు


దత్తు, శ్రీనివాస్‌లను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ సోము

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బీజేపీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను పార్టీ గుర్తిస్తుందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో పార్టీ ఓబీసీ మోర్చా నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన బొమ్ముల దత్తు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన రొంగల గోపి శ్రీనివాస్‌లను ఎమ్మెల్సీ వీర్రాజు, జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర సత్కరించి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు రేలంగి శ్రీదేవి, కోడూరి లక్ష్మీనారాయణ, పరిమి రాధ, నర్సిపల్లి హారిక, యానాపు ఏసు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలి

గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జాని పాషా

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జాని పాషా డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలోని ఎంపీఎస్‌జీవో సంఘం కార్యాలయంలో గురువారం ఉమ్మడి జిల్లా ఫెడరేషన్ కోఆర్డినేటర్ దడాల జగ్గారావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల అంకమ్మరావులతో కలిసి జానిపాషా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వానికి గుండెలాంటి వారని, దానికి కారణం ప్రభుత్వం తరపున క్షేత్రస్థాయిలో ప్రజలకు అందిస్తున్న సేవలే నిదర్శనమన్నారు. సచివాలయ ఉద్యోగులకు రికార్డు అసిస్టెంట్ క్యాడర్ మార్పుచేసి జూనియర్ అసిస్టెంట్ క్యాడర్, నోష్నల్ ఇంక్రిమెంట్లు, ఒకే క్యాడర్‌లో ఆరేళ్ల సర్వీస్ చేసిన ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్ స్కీం ద్వారా ఇంక్రిమెంట్ మంజూరు చేయవలసి ఉందని, వీటిని సాధించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. సచివాలయాల శాఖ సర్వేల శాఖగా మారిపోయిందన్నారు.సమావేశంలో ఎంపీఎస్‌జీవో అసోసియేషన్ నగర అధ్యక్షుడు పి.అనిల్‌కుమార్,సేవా ప్రవీణ్, కొల్లి రాజేష్, దుర్గాప్రసాద్, డీవీ సుబ్బారావు, శ్రీహరి, సంజయ్, డేవిడ్, కాకినాడ జిల్లా అధ్యక్షుడు దొర బాబు, ఎం.శాంతిసాగర్ పాల్గొన్నారు.

గరగలంపాలెంలో ఎమ్మెల్యే బత్తుల పర్యటన


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బత్తుల

కోరుకొండ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మన ఊరు-మన ఎమ్మెల్యే మన పల్లెబాట కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మండలంలోని గరగలంపాలెంలో పర్యటించారు. ముందుగా గ్రామ దేవతను దర్శించుకున్నారు. అనంతరం కూటమి నాయకులు, కార్యకర్తలతో జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మితో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఏదైనా సమస్య ఉంటే సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పీ4 కార్యక్రమంలో భాగంగా రెండు నిరుపేద కుటుంబాలను ఎమ్మెల్యే బత్తుల దత్తత తీసుకున్నారు. వారి బాగోగులన్నీ తాను చూసుకుంటానని హామీ ఇచ్చారు. గ్రామంలోని అంగన్వాడీ సెంటర్‌ను సందర్శించి పిల్లలకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. అలాగే గుడ్లు, పాల ను పరిశీలించి, కొద్దిసేపు పిల్లలతో గడిపారు. అనంతరం గ్రామంలో జనవాణి కార్యక్రమంతో పాటు ఏర్పాటు చేసిన ఉచిత సాధారణ, నేత్ర వైద్య శిబిరాలను సందర్శించి, వైద్య పరీక్షలు చేయించుకుంటున్న వారితో మాట్లాడి, సదుపాయాలపై ఆరా తీశారు. సంబంధిత వైద్యులతో మాట్లాడారు. జనవాణి కార్యక్రమం ద్వారా ప్రజల వద్ద నుంచి అందుకున్న అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా

12,190 కిలోల బియ్యం స్వాధీనం

రాజానగరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని మార్గమధ్యంలో రాజానగరం మండల సివిల్ సప్లైయిస్ అధికారి గొలుగూరి బాపిరాజు గురువారం స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ నుంచి కాకినాడకు టాటా మినీ లారీలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నారని ముందుగా అందిన సమాచారంతో పట్టుకున్నామన్నారు. పట్టుబడిన వాహనంలో 12,190 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు వాహన యజమాని కం డ్రైవర్ పిఠాపురం గ్రామానికి చెందిన గాలి వెంకటేష్‌ను అదుపులోకి తీసుకుని నిత్యావసర వస్తువులు చట్టం కింద కేసు నమోదు చేశామన్నారు. పట్టుబడిన బియ్యం విలువ రూ.5,60,740గా నిర్ధారించినట్టు ఎంఎస్‌వో బాపిరాజు తెలియజేశారు.


రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన లారీ

గురువులకు అగ్రతాంబూలం

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గురువులకు మన సంప్రదాయం అగ్రతాంబూలం ఇచ్చిందని రిటైర్డు ప్రిన్సిపాల్ డి.రామకృష్ణ అన్నారు. గురువారం స్థానిక ఎస్‌కేవీటీ డిగ్రీ కళాశాలలో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఆధ్యాత్మికంగాను, సామాజికంగాను గురువు ప్రాధాన్యత ఎనలేనిది అని ఆయన అన్నారు.

జిల్లా ఉత్తమోపాధ్యాయులు వీరే..



బిక్కవోలు/గోకవరం/అనపర్తి/కోరుకొండ/రాజానగరం/సీతానగరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల నుంచి పలువురు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. బిక్కవోలు మండలంలో.. ఇళ్లపల్లి ఉన్నత పాఠశాల నుంచి ఎం.శారదజ్యోతి, మెళ్లూరు ఉన్నత పాఠశాల నుంచి ఎండీ తాలిబ్‌రసూల్ షరీఫ్, పందలపాక ఉన్నత పాఠశాల నుంచి పీడీ డి.యువరాజారెడ్డి, తుమ్మలపల్లి ప్రా థమిక పాఠశాల నుంచి ఎస్ ఎస్‌వీ. రామారెడ్డి ఎంపికయ్యారని ఎంఈవో సీహెచ్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. గోకవరం మండలంలోని గోకవరం జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి హిందీ ఉపాధ్యాయురాలు రొబ్బి కృష్ణవేణి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. అనపర్తి మండలం అనపర్తిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పులగం వెంకటరెడ్డి, పులగుర్త జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.సీతామహాలక్ష్మి, పేరా రామచంద్రపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని వి.పద్మశ్రీ, కుతుకులూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు లూథర్‌పాల్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. కోరుకొండ మండలం మధురపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు బొడ్డేటి వెంకట్రావు, దోసకాయపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణితం ఉపాధ్యాయుడు సాంబశివరావు, గాడాల-2 ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కె.పూర్ణచంద్రారెడ్డి, పశ్చిమగోనగూడెం ప్రాథమిక పాఠశాల-2 ఉపాధ్యాయురాలు పీఎస్‌ఏ లక్ష్మి, గాడాల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు నల్లల వీబీ శ్రీనివాసరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. రాజానగరం మండలంలో వెలుగుబంద స్కూల్లో పనిచేస్తున్న వై.ఆగ్నేశ్వరరావు, వెలుగుబంద హైస్కూల్లో పనిచేస్తున్న పనిచేస్తున్న భాస్కర పవన్‌కుమార్, కొండగుంటూరు పాకలు గ్రామం పాఠశాలలో పనిచేస్తున్న ఎంపీఎల్‌యుబీ భగవాన్‌కు, తుంగపాడులోని జడ్పీ హెచ్ఎస్ ప్లస్ స్కూల్ ఉపాధ్యాయుడు బి.శ్రీనుకు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు లభించాయి. సీతానగరం మండలం బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సోషల్ స్టడీస్ ఉపాధ్యాయుడు ఉల్లి రామకృష్ణ, బొబ్బిల్లంక ఎంపీయూపీ స్కూల్‌లో పనిచేస్తున్న ఎ.మేరికుమారి, రఘుదేవపురం ఎంపీపీఎస్-2లో పనిచేస్తున్న జీవీ పల్లయ్య గుప్తా, మిర్తిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పనిచేస్తున్న ఆర్.సూరిబాబు, సింగవరం ఎంపీ యూపీఎస్‌లో పనిచేస్తున్న జీవీవీ దుర్గాప్రసాదరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపి కయ్యారు. వీరందరూ శుక్రవారం రాజమహేంద్రవరంలోని ఆనం కళాకేంద్రంలో నిర్వహించే గురుపూజోత్సవ కార్యక్రమంలో అవార్డులు అందుకోనున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని మండల యూటీఎఫ్, ఎస్‌టీయూ నాయకులతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు అభినందించారు.

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల
ఎన్‌సీసీ కేడెట్ల ప్రతిభ



రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు ఏవీ హేమలత, ఎం.రవిశంకర్ ఇటీవల మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో నిర్వహించిన ఇంటర్ డైరెక్టరేట్ స్పోర్ట్స్ అండ్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ క్యాంపులో పాల్గొని కళాశాలకు జాతీయస్థాయి గౌరవం తెచ్చారని ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే అన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వారిని అభినందిస్తూ ప్రతిష్ఠాత్మకమైన క్యాంపులో పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులు షేక్ ఈసుబ్ భాషా, కె.అనూష పాల్గొన్నారు.

జేగురుపాడులో ల్యాబ్ ఆన్ వీల్స్...

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల బయోటెక్నాలజీ విద్యార్థులు ల్యాబ్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా జేగురుపాడు జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బయోటెక్నాలజీకి సంబంధించిన ప్రాక్టికల్స్‌ను నేరుగా చేసి చూపించారు. ఆహారంలోని పోషక విలువలు, ఆరోగ్య సంబంధ విషయాలపైనా పోస్టర్ ప్రజంటేషన్ చేశారు. బయోటెక్నాలజీ విభాగం అధ్యాపకురాలు కె.అనూష, కె.జశ్వంతి పాల్గొన్నారు.

ఉజ్బెకిస్తాన్ మెడికోలకు ముగిసిన శిక్షణ

రాజానగరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉజ్బెకిస్తాన్‌లో వైద్య విద్యనభ్యసిస్తున్న భారతీయ విద్యార్థులకు జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో పది రోజులుగా నిర్వహిస్తున్న బేసిక్ శిక్షణ గురువారం ముగిసింది. ఈ సందర్భంగా నియో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ దివ్యరాజ్ మాట్లాడుతూ విదేశాల్లో వైద్య శాస్త్రం చదివిన భారతీయ విద్యార్థులు స్వదేశం వచ్చాక నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ)పరీక్ష ఉత్తీర్ణత సాధిస్తే తప్ప ప్రాక్టీస్‌కు అర్హత పొందలేరన్నారు. భారతీయ వైద్య విధానాల పట్ల అవగాహన పెంపొందించుకుంటూ ఉజ్బెకిస్తాన్‌లో విద్య కొనసాగించడం వల్ల మెడిసిన్ చదువు పట్ల పూర్తి స్థాయిలో అవగాహన ఏర్పరుచుకునేందుకు వీలు కలుగుతుందని దివ్యరాజ్ చెప్పారు. ఇప్పటి వరకు తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన 240 మంది శిక్షణ పూర్తి చేసుకున్నట్టు జీఎస్ఎల్ ఇంటర్నేషనల్ ఎఫైర్స్ అధికారి గోవిందరాజులు వివరించారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ గురునాథ్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్ఎస్ మిశ్రా, అనాటమీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆదిగణపతి నిమజ్జనం


ఆదిగణపతి నిమజ్జన యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా రాజమహేంద్రవరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆదిగణపతి నిమజ్జనం కార్యక్రమం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదిగణపతికి ప్రసాదంగా సమర్పించిన లడ్డూను వేలంలో రూ.6,500కు ఎమ్మెల్యే నల్లమిల్లి దక్కించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నీరుకొండ వీరన్న చౌదరి, క్షత్రియ బాలసుబ్రహ్మణ్యసింగ్, అడబాల రామకృష్ణ, వీరా వీరాంజనేయులు, సత్తిబాబు, యానాపు ఏసు, రజనీ, రవిశంకర్, కాలెపు సత్యసాయి పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని ఆర్ఎస్. పేటలో నిర్వహిస్తున్న వినాయకచవితి ఉత్సవాలు ముగిసాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బోను సూర్యకుమార్, మాడా మోహన్, కోటిపల్లి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: మండలంలో వినాయక నిమజ్జనాలు జోరుగా నిర్వహించారు. గురువారం మరుసటి రోజు శుక్రవారం కావడం, తదుపరి చంద్రగ్రహణం కావడంతో గురువారం గణేష్ నిమజ్జనాలు నిర్వహించారు. పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, ముగ్గళ్ల, మునికూడలి, బొబ్బిల్లంక గ్రామాల్లో గోదావరి రేవుల్లో నిమజ్జనాలు చేశారు. గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఏ విధమైన అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీతానగరంలో భవాని ఆటో యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి నివేదించిన 20 కిలోల లడ్డూ ప్రసాదాన్ని గ్రామానికి చెందిన యర్రోజు శ్రీనివాసరావు రూ.9,500కు వేలంలో దక్కించుకున్నారు.

విద్యుదాఘాతంతో పాలవ్యాపారి మృతి

రాజానగరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతానికి గురై పాల వ్యాపారి దుర్మరణం చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలో పాతతుంగపాడు గ్రామానికి చెందిన మేడిద పట్టాభిరామ్(21) ప్రతి రోజూ పాతతుంగపాడు నుంచి భూపాలపట్నం, అక్కడి నుంచి రాజమహేంద్రవరం పాల క్యాన్‌లను ఆటోలో రవాణా చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో గురువారం మార్గమధ్యంలో భూపాలపట్నంలో ఆటో వెళ్తున్న మార్గంలో రోడ్డు చెంతన కిందికి వేలాడుతున్న విద్యుత్ సర్వీసు వైరును అడ్డు తొలగించేందుకు వైరును చేతితో పట్టుకుని పక్కకు జరుపుతున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా ప్రమాద విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆసుపత్రికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వ పరంగా అందే పరిహారాన్ని త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకుంటామని బాధిత కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఈ ఘటనపై రాజానగరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులతోనే సమాజ ప్రగతి

టీడీపీ వైద్యవిభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్

కడియం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉన్నత ఆశయాలు కలిగిన ఉపాధ్యాయులతో సమాజం ప్రగతి పథంలో నడుస్తుందని టీడీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ అన్నారు. కడియంలో వెలుగుబంటి రామచంద్రరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న 9 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేసి సత్కరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన కిరణ్ ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, జి.పాలశంకర్, జి.ఆనంద్, టీవీ అరుణగాయత్రి, జి.శరత్‌బాబు, ఎన్.శ్రీవల్లిత యారు, ఎం.బ్యూలారత్నం, పి.రమానాగేశ్వరి, కె.గంగాభవానీలకు ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.సత్యవతి, చిక్కాల ఈశ్వరరావు, చారిటబుల్ ట్రస్ట్ గౌరవాధ్యక్షుడు, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, ట్రస్ట్ అధ్యక్షులు వెలుగుబంటి రఘురామ్(నాని), హెచ్ఎం టి.సత్యనారాయణ, ఎంఈవోలు మణికుమార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్‌లో చదువుతున్న 35 మంది బాలికలకు యూనిఫాం కోసం రవిరామ్ కిరణ్ స్వీయనిధులు రూ.40వేలు అందజేశారు.

జూనియర్ కాలేజీలో గురుపూజోత్సవం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఘనంగా గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. అధ్యాపకులను విద్యార్థులు శాలువా, పూలదండలతో సత్కరించి, ఆశీర్వాదాలు తీసుకున్నారు. జిల్లా వృత్తి విద్యా అధికారి విజయశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణన్‌ని ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడిచి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆమె పేర్కొన్నారు. కెమిస్ట్రీ లెక్చరర్, ఇన్చార్జి ప్రిన్సిపాల్ త్రినాథరాజు రాష్ట్రస్థాయి బెస్ట్ టీచర్ అవార్డుకు ఎంపికైన సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐవో నరసింహం, ఎస్ఎస్ఎస్ వీవోలు రామకృష్ణ, శివరామకృష్ణ, చార్లెస్ వెస్లీ, కల్యాణ్‌కుమార్, అరుణ, ప్రసాదరెడ్డి, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి ఏఎంసీ చైర్‌పర్సన్‌గా సూర్యకుమారి



అనపర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా పెదపూడి మండలం గొల్లల మామిడాడకు చెందిన జుత్తుక సూర్యకుమారి నియమితులయ్యారు. ఈమె పెదపూడి మండల పరిషత్ అధ్యక్షురాలిగా పని చేశారు. ప్రస్తుతం అనపర్తి నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలిగా పనిచేస్తూ 2024 ఎన్నికల్లో కూటమి విజయానికి విశేష కృషి చేశారు. సూర్యకుమారి భర్త కృష్ణ పెదపూడి టీడీపీ మండలాధ్యక్షుడిగా ఉన్నారు. 2024 ఎన్నికల ముందు నుంచి మహిళా శక్తి పేరుతో ఆమె నియోజకర్గంలోని పర్యటించి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఎమ్మెల్యే నల్లమిల్లి విజయానికి కృషి చేశారు. ఈ సందర్భంగా ఆమె తనకు ఈ పదవి ఇచ్చిన సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి మనోజ్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను శక్తి వంచన నిర్వహిస్తానని అన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

రూ.2.50 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం

ధవళేశ్వరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టపగలు ఇంట్లో చోరీకి పాల్పడిన దొంగను పోలీసులు అరెస్టు చేసి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఉదయం సీఐ టి.గణేష్ తెలిపిన వివరాలు ప్రకారం.. ఈ నెల 1న ధవళేశ్వరంలోని గ్రంథాలయం వీధిలో ఉంటున్న వంకా బాలకృష్ణ భార్య సాహిత్య ఇంటి తలుపులు గడియ పెట్టి ఫైపోర్షన్‌లో ఉంటున్న తోడికోడలు వద్దకు వెళ్లింది. ఇది గమనించిన సున్నం బట్టి వీధికి చెందిన జీరీ ఆకాష్‌రెడ్డి అలియాస్ సాహూ అనే యువకుడు ఇంట్లోకి దూరి పరుపుకింద ఉన్న తాళాలతో బీరువా తెరిచి బంగారు చైన్, నల్లపూసల గొలుసు, చెవి దిద్దులు, బంగారు రూపు, వెండి గాజు, గిన్నెలు దొంగిలించుకుపోయాడు. ఈ కేసు లో దర్యాప్తులో భాగంగా పోలీసులు పాత నేరస్తులపై నిఘా ఉంచారు. చోరీ చేసిన తరువాత ఆకాష్ రెడ్డి స్నేహితులతో కలిసి జల్సా చేస్తుండడంతో అనుమానంతో సీఐ గణేష్ పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ బి.శ్రీనివాస్, కానిస్టేబుల్స్ దుర్గాప్రసాద్, కేవీ లక్ష్మణరావు ప్రత్యేక నిఘా పెట్టారు. గురువారం ఉదయం సున్నం బట్టి వీధిలో గంగమ్మ రేవు వద్దకు వచ్చిన పోలీసులను చూసి ఆకాష్‌రెడ్డి పారిపోయే ప్రయత్నం చేయగా అదుపులోకి తీసుకున్నారు.అతడి నుంచి రూ.2.50 లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఆకాష్‌రెడ్డి పాత నేరస్తుడని ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌లో 3 కేసులు ఉన్నాయని సీఐ తెలిపారు. 3 రోజుల్లో కేసును చేధించిన సీఐ గణేష్, ఎస్ఐ హరిబాబు, హెచ్‌సీ, కానిస్టేబుళ్లను ఎస్పీ నరసింహకిషోర్ అభినందిస్తూ రివార్డు ప్రకటించారు.

సింహాచల్‌నగర్‌లో డ్రైనేజీ అభివృద్ధి పనులు


డ్రైనేజీ పనులకు శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక 49వ డివిజన్‌లో సింహాచల్ నగర్‌లో రూ.32.50 లక్షలతో చేపట్టనున్న అవుట్ పాల్ డ్రైన్ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు గురువారం శంకుస్థాపన చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింహాచల్ నగర్‌లో రోడ్లు, డ్రైన్లు, కరెంట్ స్తంభాలు, ఏదైనా సరే టీడీపీ హయాలోనే జరిగాయన్నారు.వర్షానికి ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీరు క్వారీ గోతుల్లో చేరి దుర్గంధం వస్తోందని, ఈ డ్రైన్ నిర్మిస్తే నీరు నిలిచిపోవడం, క్వారీ గోతుల్లోకి వెళ్లడం ఉండదని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో దుత్తరపు గంగాధర్, కాశి నవీన్‌కుమార్, రాచపల్లి ప్రసాద్, మొకమాటి సత్యనారాయణ, నేమాలి శ్రీను, తురకల నిర్మల, అగురు ధనరాజు, కేబుల్ మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ సమాజ స్థాపనలో
గురువుల పాత్ర కీలకం

రాజానగరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ సమాజ స్థాపనలో గురువుల పాత్ర కీలక పాత్ర పోషిస్తుందని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జీజీయూ) ప్రొ ఛాన్సలర్ కె.శశి కిరణ్ వర్మ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని జీజీయూలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శశికిరణ్, వైస్ ఛాన్సలర్ యు.చంద్రశేఖర్ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా శశికిరణ్ మాట్లాడుతూ విద్యావ్యవస్థకు మూల స్తంభాలు ఉపాధ్యాయులేనన్నారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి విశ్వవ్యాప్తంగా వన్నె తెచ్చిన మహోన్నత మూర్తి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని, ఆయన జీవిత విశేషాలను స్మరించుకుంటూ విద్యారంగంలో ఆయన చూపిన మార్గాన్ని అనుసరించాలన్నారు. దీనిలో భాగంగా విద్యా రంగంలో విశేష విజయాలు సాధించిన అధ్యాపకులను నగదు పురస్కారాలు, దుస్తులు, జ్ఞాపికలతో సత్కరించారు.కార్యక్రమంలో ప్రొ వైస్ చాన్సలర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ పీఎం ఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్స్ టి.జయానందకుమార్, ఎంవీఎస్ బాబు, ఎండీ ధనరాజు పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: ఘాటీ
సూర్యమినీ	: ది కంజ్యూరింగ్
సూర్యప్యాలస్	: ఘాటీ
స్వామి	: కూలీ
అనుశ్రీ(సాయికృష్ణ)	: మదరాసి
శివజ్యోతి	: ది బెంగాల్ ఫైల్స్
రాజా	: మదరాసి
ఊర్వశి	: లిటిల్ హార్ట్స్
మేనక	: ది కంజ్యూరింగ్
రంభ	: మహావతార్ నరసింహ
అప్సర	: కొత్తలోక
అశోక	: మదరాసి
వీఎస్ మహాల్(నామవరం)	: ఘాటీ
మురళీకృష్ణ(ధవళేశ్వరం	: ఘాటీ, మదరాసి
వెంకటసూర్య(కడియం)	: మదరాసి, ఘాటీ
సత్యగౌరి (అనపర్తి)	: మదరాసి
సూర్యశ్రీ (అనపర్తి)	: ఘాటీ
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: మదరాసి, కొత్తలోక
రామకృష్ణ(కోరుకొండ)	: మహావతార్ నరసింహ
గీతాసినిమాస్ (సీతానగరం)	: మహావతార్ నరసింహ
శ్రీనివాస (గోకవరం)	: ఘాటీ
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: మదరాసి
లలితామహాల్(రంపచోడవరం)	: మహావతార్ నరసింహ
నవయుగ(చింతూరు)	: హరిహర వీరమల్లు





కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో క్రేన్ సహాయంతో గోదావరిలో వినాయక విగ్రహం నిమజ్జనం చేస్తున్న దృశ్యం







రాజమహేంద్రవరంలో గోదావరిలో నిమజ్జనానికి తీసుకొస్తున్న గణేష్ ప్రతిమలు.. నిమజ్జన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న పోలీసు అధికారులు

ప్రశాంతంగా గణేష్ నిమజ్జనాలు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): గణేష్ నిమజ్జనాలు గురువారం 9వ రోజున ప్రశాంతంగా జరిగాయి. పోలీసులు ఎక్కడికక్కడ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్‌కి అంతరాయం కలగకుండా సాఫీగా నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. విగ్రహాలు ఎక్కువగా లాంచీల రేవుకు మళ్లించారు. అక్కడ లాంచీకి పంటును అనుసంధానించి, దానిపై ఐదారు విగ్రహాల చొప్పున చేర్చి వాటిని గోదావరిలోకి కొంతమేర తీసుకెళ్లి నిమజ్జనం చేస్తున్నారు. అడిషనల్ ఎస్పీలు మురళీకృష్ణ, సుబ్బరాజు ఆయా ఘాట్లకు వెళ్లి పరిస్థితిని సమీక్షించి పలు సూచనలు చేశారు. రాత్రి సమయంలో ఎక్కువ సంఖ్యలో విగ్రహాలను తీసుకొస్తారని లైటింగ్ ఏర్పాట్లను చేశారు. మండపాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన సమయంలో నిజమజ్జనానికి వచ్చే మార్గం, తేదీ, సమయం వంటి వాటిని పోలీసులు తీసుకున్నారు. దీంతో ఆయా సమయాలకు అనుగుణంగా పహారా ఏర్పాట్లు చేస్తున్నారు.



పత్రి చెత్తలోకి.. పీవోపీ గోదావరిలోకి..

» మునిసిపల్ కార్పొరేషన్ నిర్వాకం » ఈ ఏడాది కొత్త ఆలోచనతో ఇబ్బందులు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పత్రి నిమజ్జనం విషయంలో మునిసిపల్ కార్పొరేషన్ నిర్వాకం భక్తుల మనోభావాలను నొచ్చుకునేలా చేస్తోంది. అవసరమైన వాటిని చెత్తలో పడేస్తూ.. హాని కలిగించే వాటిని నదీ జలాల్లో కలుపుతున్నారు. చవితి పూజల్లో 21 రకాల పత్రిది ప్రధాన స్థానం. ఆ దళాలను నీటిలో కలపడం వల్ల మేలు జరుగుతుంది. మారేడు, నేరేడు, ఉసిరి, మామిడి, జమ్మి తదితర ఆకులు, శేష పూలమాలలు నీటిని శుద్ధి చేయడానికి ఉపయోగపడితే, బియ్యం, పండ్లను జలచరాలు ఆహారంగా తీసుకుంటాయి. ఒకప్పుడు మట్టితో చేసిన ప్రతిమల వల్ల హాని ఉండేది కాదు. పూర్వం పత్రిని నూతిలో కలిపితే ఏడాది వరకూ సహజ బ్లీచింగ్‌గా పని చేసి నీళ్లు శుద్ధిగా ఉండేవి. అందుకే ఆ సంప్రదాయానికి మన పెద్దలు దైవత్వాన్ని ఆపాదించి ప్రకృతికి మేలు చేసే అలవాటును అందించారు. ఆ మహత్తర ఏర్పాటును ఇప్పుడు మునిసిపల్ కార్పొరేషన్ చెత్త కుప్పల్లోకి చేర్చడం భక్తులకు ఆగ్రహం కలిగిస్తోంది. వినాయకుడి చవితి పూజలో ఆధ్యాత్మికం ఒక కోణమైతే.. ప్రకృతికి మేలు చేయడం రెండో కోణం. పూజలో వినియోగించే ఆకులు(పత్రాలు) నుంచి ఆల్కలాయిడ్స్ వెలువడి నీటిలో కలవడం ద్వారా నీటి శుద్ధి జరుగుతుంది. సూక్ష్మజీవులు నశిస్తాయి. పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో సహాయం చేస్తాయి. చవితి సాధారణంగా ఆగస్టు నెలలో వస్తుంది. అప్పుడు వర్షాల వల్ల జలవనరుల్లోకి కొత్త నీరు రాక మొదలవుతుంది. పత్రిలోని పత్రాలు ఆ నీటిని శుభ్రం చేస్తాయి. వినాయక చవితి ఒక పండుగే కాకుండా పర్యావరణానికి, జీవుల మనుగడకు మేలు చేసే ఒక మహత్తర ప్రక్రియని చెప్పవచ్చు. అలాంటి పత్రిని రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ చెత్తలో కలిపేస్తోంది. పత్రిని గోదావరిలో కలపనీయకుండా అన్ని చోట్లా రేవుల వద్ద డస్ట్ బిన్లలో పడేయిస్తున్నారు. వాటిని ట్రాక్టర్లలో డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఇలా రోజుకు సుమారు 2 టన్నుల పత్రిని అక్కడికి చేర్చి ఇతర వ్యర్థాలో కలిపేసి కంపోస్టు ప్రక్రియ చేపడుతున్నారు. 45 రోజులపాటు కుళ్లబెట్టడానికి లారీల్లో గుంటూరు తరలిస్తున్నారు. ఇది తెలుసుకున్న భక్తులు ఈ తంతుకు తాము ఇక్కడి వరకూ పత్రి తీసుకు రావడం దేనికని, ఇంటి వద్దకు ఇచ్చే చెత్త సేకరణ ఆటోలకు ఇచ్చేయమంటే సరిపోయేది కదాని ఆగ్రహిస్తున్నారు. ఈ తతంగం చూసి కొందరు గోదావరి బ్రిడ్జిపై నుంచి, నగరానికి దూరంగా ఉండే రేవుల్లోకి తీసుకెళ్లి నిమజ్జనం చేస్తున్నారు. విగ్రహాలను గోదావరిలో కలుపుతున్నారు. విగ్రహాల తయారీలో వాడే ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్, రసాయన రంగులు వంటి వాటివి నీటి ద్వారా మనుషుల్లో చేరి క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులకు కారణం అవుతున్నాయి. వేలల్లో ఉంటున్న విగ్రహాలు కొన్నేళ్లపాటు నీటిని కలుషితం చేస్తున్నాయి. అయినా నీటిలో నిమజ్జనం తప్పడం లేదు. నీటి వనరులను శుభ్రం చేసే పత్రిని వ్యర్థాల్లో పడేస్తూ.. నిషేధం ఉన్న పీఓపీ విగ్రహాలను మాత్రం గోదావరిని కలుషితం చేయడానికి వినియోగించడంపై కార్పొరేషన్ అధికారులు ఆలోచించాల్సిన అవసరం ఉందని భక్తులు అంటున్నారు. పత్రిని గోదావరిలో కలపడం వల్ల ఇబ్బందేమీ లేదు. కానీ పీవోపీ వినాయక విగ్రహాలు తొందరగా నీటిలో కరగవు. నగరంలో రోజుకు 100 టన్నుల వరకూ వ్యర్థాలు పోగవు తున్నాయి. వాటితో కంపోస్టు తయారు చేసే కేంద్రాలు సరిగా పనిచేయడం లేదని ఇటీవలే కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి రోజుకు టన్ను, రెండు టన్నులు మాత్రమే ఉంటోంది. అదీ డంపింగ్ యార్డుకు తరలించడంపై భక్తులు మండిపడుతున్నారు.



రాజమహేంద్రవరంలో డంపింగ్ యార్డుకు తరలించిన నిమజ్జనోత్సవ పత్రి, పూజా సామగ్రి



రాజమహేంద్రవరంలోని గోదావరి పుష్కర ఘాట్ వద్ద పేరుకుపోయిన వినాయక పత్రి, పూజా సామగ్రి



లావణ్యలక్ష్మిని కలిసి అభినందిస్తున్న కలెక్టరు పి.ప్రశాంతి

దివ్యాంగురాలికి కలెక్టరు ప్రశాంతి అభినందన

తాళ్లపూడి, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నదేవరపేట గ్రామంలో దివ్యాంగురాలైన ఆకుల లక్ష్మీలావణ్య ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో 500 మార్కులకుగానూ 345 (69 శాతం) మార్కులు సాధించి మొదటి స్థానంలో ఉత్తీర్ణత సాధించింది. దీంతో జిల్లా కలెక్టర్ ప్రశాంతి గురువారం స్వయంగా ఆమె ఇంటికి వెళ్లి అభినందించారు. ఆగస్టు 11న కలెక్టరేట్‌లో లావణ్యలక్ష్మి కలెక్టరును కలిసినప్పుడు ఆమె మీ ఇంటికి వస్తానని చెప్పిన మాటను కలెక్టరు గుర్తుంచుకుని గురువారం తాళ్లపూడి మండలంలో పర్యటనలో భాగంగా లావణ్యలక్ష్మి ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని, అందుకు దివ్యాంగురాలైన లావణ్యలక్ష్మి ప్రత్యక్ష నిదర్శనం అని అన్నారు. ఆకుల లావణ్యలక్ష్మి మాట్లాడుతూ కలెక్టరు తన ఇంటికి స్వయంగా వచ్చి ఆశ్చర్యానికి గురిచేశారని, ఎంతో సంతోషంగా ఉందన్నారు.



భవన నిర్మాణాలను పరిశీలించి అధికారులతో చర్చిస్తున్న ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ ప్రశాంతి

భవన నిర్మాణ అనుమతుల జారీలో జాప్యం తగదు

ఇన్‌చార్జి కమిషనర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ అనుమతుల జారీలో ఎక్కడా జాప్యం ఉండకూడదని జిల్లా కలెక్టర్, రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి ఆదేశించారు. గురువారం ప్రకాష్‌నగర్, సోమలమ్మ పుంత రోడ్డు, రెయిన్‌బో హాస్పిటల్ రోడ్డులో పర్యటించి పలు భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడారు. అనుమతులు పొందిన భవన యజమానులు ఇచ్చిన ప్లాన్ ప్రకారం నిర్మాణాలు జరుగుతున్నాయా? లేదా అనే సమగ్రంగా పరిశీలించాలన్నారు. ప్లానింగ్‌లో వ్యత్యాసాలు ఉంటే చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అనుమతులు లేకుండా నిర్మిస్తుంటే నిబంధనల మేరకు నోటీసులు జారీ చేయాలన్నారు. వాహనాలు అపార్టుమెంట్లలో పలే పార్కింగ్ చేసుకునేలా యజమానులకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. ఇష్టానుసారంగా రోడ్లపై పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఇన్‌చార్జి ప్రశాంతి వెంట సీపీ కోటయ్య, ఏసీపీలు శ్రీనివాస్, నాగవల్లి, టౌన్ ప్లానింగ్ అధికారులు ఉన్నారు.



» ఉమ్మడి తూ.గో.లో మున్సిపల్, పంచాయతీ ఎన్నికలకు ముందస్తు సన్నాహాలు
» మునిసిపల్, పంచాయతీరాజ్‌శాఖలకు లేఖలు రాసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
» 2026 జనవరిలోగా మునిసిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు వచ్చే నెల నుంచే సన్నాహాలు
» అక్టోబరు 15లోగా వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ
» నవంబరు 16 నుంచి 30లోగా పోలింగ్ కేంద్రాల ఖరారు, ఈవీఎంల సన్నద్ధత
» ఉమ్మడి జిల్లాలో రెండు కార్పొరేషన్లు, 9 మునిసిపాలిటీలు, 3 నగర పంచాయతీలు

'స్థానిక' సందడి!

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని స్థానిక సంస్థల ఎన్నికల సందడి కొన్ని నెలల్లో మొదలుకాబోతోంది. మున్సిపల్, పంచాయతీ ఎన్నికలను నిర్వహించడానికి రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది. వచ్చే ఏడాది జనవరిలోగా అంటే మరో ఐదు నెలల్లో మొత్తం ప్రక్రియ పూర్తి చేసి పోలింగ్, ఎన్నికల ఫలితాల ప్రకటనకు కార్యాచరణ సిద్ధం చేసింది. వచ్చే నెల నుంచే మున్సిపాల్టీలు, పంచాయతీల్లో వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ కసరత్తు ప్రారంభించాలని తాజాగా అధికారులకు ఆదేశాలు జారీచేసింది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి త్వరలోనే మొదలు కానుంది. కాగా ఉమ్మడి జిల్లాలో రెండు కార్పొరేషన్లు, 9 మునిసిపాలిటీలు, మూడు నగర పంచాయతీల్లో పుర ఎన్నికలు, 1,073 పంచాయతీల్లో ఎన్నికలు జరగనున్నాయి. కొత్త తూర్పుగోదావరి జిల్లా పరిధిలోకి వచ్చే నిడదవోలు, కొవ్వూరు మున్సిపాలిటీలకు సంబంధించి వార్డుల పునర్విభజన చేయాల్సి ఉన్న నేపథ్యంలో పెరిగే కొత్త వార్డులతో కలిపి ఎన్నికలు నిర్వహించనున్నారు.

(రాజమహేంద్రవరం/కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికల తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలుకాబోతోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో కాకినాడ, రాజమహేంద్రవరం కార్పొరేషన్లు, మునిసిపాలిటీలు, నగర పంచాయతీలకు, ఆ తర్వాత పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఎస్‌ఈసీ రంగం సిద్ధంచేస్తోంది. ఉమ్మడి తూర్పుగోదావరిలో 2021లో మునిసిపల్, పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఆయా మునిసిపల్ ఛైర్మన్లు, వార్డు కౌన్సిలర్లు, సర్పంచులు, వార్డు మెంబర్ల పదవీకాలం వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తికాబోతోంది. ఆ తర్వాత వీటికి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే వీరి పదవీకాలం ముగిసేలోపు మూడు నెలల ముందే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈమేరకు పురపాలక, పంచాయతీరాజ్‌శాఖలకు ఎస్‌ఈసీ లేఖ రాసింది. మున్సిపాల్టీలు, పంచాయతీలకు వచ్చే ఏడాది జనవరిలో ఎన్నికలు నిర్వహించడానికి వీలుగా కసరత్తు ప్రారంభించాలని ఆదేశిస్తూ మార్గదర్శకాలు జారీచేసింది. దీని ప్రకారం వచ్చే నెల 15లోగా వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించింది. అక్టోబరు 16 నుంచి నవంబరు 15లోగా వార్డులవారీగా ఓటర్ల జాబితాల ప్రచురణ, నవంబరు 1 నుంచి 15లోగా ఎన్నికల అధికారుల నియామకం, నవంబరు 16నుంచి 30లోగా పోలింగ్ కేంద్రాల ఖరారు, ఈవీఎంలను సిద్ధం చేయడం పూర్తిచేయాలని ఆదేశించింది. డిసెంబరు 15లోపు రిజర్వేషన్లు ఖరారు, 2026 జనవరిలో ఎన్నికల నోటిఫికేషన్, అదే నెలలో ఫలితాల వెల్లడికి వీలుగా ఏర్పాట్లు చేయాలని సూచించింది. ఇక కాకినాడ కార్పొరేషన్‌కు 2022 సెప్టెంబరుకు అయిదేళ్ల పదవీకాలం పూర్తయిన తర్వాత మళ్లీ ఇప్పటివరకు ఎన్నికలు జరగలేదు. అయితే తాజా ఎస్‌ఈసీ ఆదేశాల నేపథ్యంలో వార్డుల పునర్విభజనతో అదనంగా మరో పది వార్డుల వరకు పెరిగే అవకాశం ఉంది. అటు రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో శివారు గ్రామాల విలీనం సమస్య పరిష్కారమై పెరిగే వార్డులతో కలిపి ఇక్కడా ఎన్నికలు జరగనున్నాయి. ఇదిలాఉంటే 2021 మార్చిలో ఉమ్మడి జిల్లాలో ఏడు మునిసిపాలిటీలు, మూడు నగర పంచాయతీల్లో కలిపి మొత్తం 268 వార్డులకు ఎన్నికలు నిర్వహించారు. అప్పట్లో చేతిలో అధికారం ఉండడంతో వైసీపీ అడ్డగోలుగా 35 వార్డుల్లో బలవంతపు ఏకగ్రీవాలు చేయించింది. దీంతో 233 వార్డులకే ఎన్నికలు జరిగాయి. అయితే మళ్లీ ఇప్పుడు వార్డుల పునర్విభజన నేపథ్యంలో ఒక్కో మున్సిపాల్టీ, నగర పంచాయతీల్లో వార్డుల సంఖ్య మరింత పెరగనుంది. అలాగే ఉమ్మడి జిల్లాలో 2021 ఫిబ్రవరిలో 1,073 పంచాయతీల్లో నాలుగు దశల్లో 11,782 వార్డులకు 12,048 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికలు నిర్వహించారు. 31 పంచాయతీలకు వివిధ కారణాలతో ఎన్నికలు జరగలేదు. వచ్చే ఏడాది జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో వార్డులు మరిన్ని పెరగనున్నాయి.

అప్పుడంతా అరాచకం...

ఉమ్మడి జిల్లాలో 2021లో జరిగిన మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ అరాచకాలు సృష్టించింది. ప్రతిపక్ష టీడీపీ, జనసేనలను నానా హింస పెట్టింది. ఈ పార్టీల అభ్యర్థులను చాలాచోట్ల నామినేషన్లను దాఖలు చేయకుండా అడ్డుకుని ఏకంగా కిడ్నాప్‌లు చేసింది. బెదిరింపులకు దిగి ఏకగ్రీవాలు చేయించుకుంది. అయితే టీడీపీకి బలం ఉన్న చోట జనసేన, జనసేనకు బలం ఉన్న పలు చోట్ల టీడీపీ సహకరించుకుంటూ కదిలి వైసీపీ అరాచకాలను కొంతవరకు అడ్డుకోగలిగాయి. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి అఖండ విజయంతో అధికారంలోకి వచ్చింది. తర్వాత ఒక్కో మున్సిపాల్టీ కూటమి పరిధిలోకి వచ్చేశాయి. తుని, నిడదవోలు, కొవ్వూరు ఇలా కూటమిలో చేరిపోయాయి. ఇంకా కొందరు రావడానికి సిద్ధంగా ఉన్నా ఎన్నికలు జరిగే సమయంలో ఈ తలపోటు మనకెందుకులే అన్నట్టు వదిలేశారు. ఉమ్మడి జిల్లాలో పరిధిలో రాజమండ్రి, కాకినాడ కార్పొరేషన్లు, అమలాపురం, తుని, పిఠాపురం, సామర్లకోట, మండపేట, రామచంద్రపురం, పెద్దాపురం మున్సిపాలిటీలు, ఏలేశ్వరం, గొల్లప్రోలు, ముమ్మిడివరం నగర పంచాయతీలు ఉన్నాయి. అలాగే కొత్త తూర్పుగోదావరి జిల్లా పరిధిలో కొవ్వూరు డివిజన్ కూడా కలవడం వల్ల కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీలు కూడా వచ్చి చేరాయి. అంటే 2 కార్పొరేషన్లు, 9 మునిసిపాలిటీలు, 3 నగర పంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉంది.



● రాజకీయ వర్గాల్లో సందడి

మునిసిపల్ ఎన్నికలు అనగానే పట్టణ ప్రాంతంలో రాజకీయ సందడి మొదలవుతోంది. రాజమండ్రి, కాకినాడ కార్పొరేషన్లకు పాలకవర్గాలు లేనందువల్ల అక్కడ ప్రజాప్రతినిధులు, పదవులు ఆశించేవారు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారు. మిగతా మునిసిపాలిటీల్లో వైసీపీ నేతలు కూడా ఉన్న సంగతి తెలిసిందే. ఈసారి మొత్తం మునిసిపాలిటీలను కైవసం చేసుకోవడానికి టీడీపీ కూటమి సిద్ధమవుతోంది. మొత్తం కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో ఎన్నికలు జరిగితే 300మందికి పైగా కార్పొరేటర్లు, కౌన్సిలర్లుగా ఎన్నికవుతారు. ఇద్దరు మేయర్లు, 12 మంది మున్సిపల్ ఛైర్మన్లు వస్తారు. డిప్యూటీ మేయర్లు, కోఆప్స్ సభ్యుల పేరిట కూడా పలువురికి పదవులు వస్తాయి. ఈనేపథ్యంలో టీడీపీ కూటమిలో బాగా సందడి పెరిగింది. వైసీపీ సరైన ప్రతిపక్షంగా కూడా లేకపోవడం వల్ల ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలనే మీమాంసలో పడింది. పలువురు వైసీపీ నేతలు వీలు దొరికితే కూటమిలోకి దూకేసే ప్రయత్నాలు ఇప్పటికే మొదలుపెట్టారు.

రాజమండ్రి కార్పొరేషన్ పరిధి పెరిగేనా..?

రాజమండ్రి మున్సిపల్ కార్పొరేషన్‌కు 2021 ఎన్నికలు జరగలేదు. రాజమండ్రి రూరల్ పరిధిలోని పలు గ్రామాల విలీన సమస్య వల్ల ఎన్నికలు జరగలేదు. వాస్తవానికి అంతకుముందే టీడీపీ ప్రభుత్వం రాజమండ్రి రూరల్, రాజానగరం, కోరుకొండ మండలాల్లోని పలు గ్రామాలను విలీనంచేసి 54 డివిజన్లుగా విభజించి, రిజర్వేషన్లు కూడా ఖరారుచేసింది. తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చింది. రాజానగరం, కోరుకొండ మండలాల్లోని గ్రామాలను విలీనానికి దూరం చేసే ప్రయత్నం చేసింది. తర్వాత డివిజన్లను 52గా చేసి రాజమండ్రి రూరల్ మండలంతో పాటు వేమగిరి గ్రామాన్ని కార్పొరేషన్ పరిధిలోకి తెచ్చింది. మళ్లీ కోర్టు లిటిగేషన్లతో సమస్య అలానే మిగిలింది. ఇప్పటికీ ప్రత్యేకాధికారుల పాలనలో కార్పొరేషన్ ఉంది. ఈసారి ఎన్నికలు నిర్వహించడానికే కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. విలీన సమస్య పరిష్కారమైతే 52 డివిజన్లతో మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికలు జరుగుతాయి. రాజానగరం మండలం, కోరుకొండ మండలంలోని పలు గ్రామాలను విలీనం చేస్తే డివిజన్ల సంఖ్య 54 అవుతాయి.

కేబినెట్ ఆమోదం

ఎర్రకాలువ వరద నష్టానికి నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గానికి నిధులు

రాజమహేంద్రవరం,సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది వరద ప్రభావంతో నిడదవోలు, గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో దెబ్బతిన్న ఇరిగేషన్ పనుల పునర్ నిర్మాణం, మరమ్మతుల కోసం నిధులు కేటాయిస్తూ చేసిన ప్రతిపాదనకు గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశం ఆమోదం తెలిపింది. వీటితోపాటు పిఠాపురం, తణుకు, తాడేపల్లిగూడెం పరిధిలో జరిగిన నష్టానికి కూడా నిధులు కేటాయించారు. గోపాలపురం, నిడదవోలు, తాడేపల్లిగూడెం, తణుకు పరిధిలో ఎర్రకాలువ వరద తీవ్ర నష్టం జరిగిన సంగతి తెలిసిందే. దీనిపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ కందుల దుర్గేష్ ఈ పనుల గురించి ప్రభుత్వానికి నివేదించారు. వీటితోపాటు రాష్ట్రంలో మొత్తం 392 పనులకు రూ. 5714.58 లక్షలను మంజూరు చేస్తూ కేబినెట్ ఆమోదం తెలిపినట్టు మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.

నేడు జిల్లాస్థాయి గురుపూజోత్సవ సభ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి గురుపూజోత్సవం శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో శుక్రవారం ఉదయం పది గంటల నుంచి నిర్వహిస్తామని డీఎస్ఈవో వాసుదేవరావు తెలిపారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం ఉంటుందన్నారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరవుతారన్నారు.

ముస్లింలకు మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు : ఎస్పీ

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 4, (ఆంధ్రజ్యోతి): మహమ్మద్ ప్రవక్త జన్మదినోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఎస్పీ నరసింహ కిషోర్ పేర్కొన్నారు. ముస్లింలకు మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు తెలిపారు. మహమ్మద్ ప్రవక్త జీవితం మానవ జాతికి ఆదర్శమన్నారు. సామరస్యం, సోదరభావం, ఇతరుల పట్ల ప్రేమ ప్రవక్త చూపిన మార్గాలని, వాటిలో ప్రజలు నడవాల్సిన అవసరం ఉందని జిల్లా ఎస్పీ అభిలషించారు.



విలేకరులతో మాట్లాడుతున్న అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

జీఎస్టీ రెండు శ్లాబులతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనం : ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ విధానంలో కేంద్ర ప్రభుత్వం సమూలమార్పులు తెస్తోందని, ప్రస్తుతమున్న నాలుగు శ్లాబుల నుంచి రెండు శ్లాబులకు తీసురావడం ఒక చారిత్రాత్మకమైన పరిణామమని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో ఉదయం సోము వీర్రాజు, సాయంత్రం నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విలేకరులతో మాట్లాడారు. ఆరోగ్యం, బీమా రంగాలపై జీఎస్టీని పూర్తిగా ఎత్తేశారని, వ్యవసాయ ఉత్పత్తులకు 18 నుంచి 5 శాతానికి, గృహోపకరణాలు 28 నుంచి 18 శాతానికి, నిత్యావసరవస్తువులను 18 నుంచి ఐదుశాతానికి తగ్గించారన్నారు. జీఎస్టీలో సంస్కరణలమూలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ. 48 వేల కోట్లు ఆదాయం నష్టపోతున్నా ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ప్రజలకు ప్రయోజనమైన కార్యక్రమాలు చేపట్టాలనే లక్ష్యంతో శ్లాబులను కుదించారని అన్నారు. దీనివల్ల పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుగుతుందని అన్నారు. రాష్ట్రంలోని రైతులు యూరియా కొరత ప్రధానంగా ఎదుర్కొంటున్నారని, ఈ పరిస్థితిలో 53 వేల టన్నుల యూరియాను కేంద్రం రాష్ట్రానికి కేటాయించిందన్నారు. ఇప్పటికే 10 వేల టన్నులు వచ్చిందని, వారం పదిరోజుల్లో మరో 30 వేల టన్నులు రానున్నాయని అన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రాహుల్, జగన్‌లది అరాచక ధోరణి..

రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిన పరిస్థితిలో రాహుల్ గాంధీ, జగన్మోహనరెడ్డి అరాచకంగా ప్రవర్తించాలనే ధోరణితో వ్యవహరిస్తున్నారు. వారి ఉనికికే ప్రమాదం ఏర్పడింది అని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. జగన్మోహనరెడ్డి ఇటీవల పులివెందుల వెళితే సందర్శకులకు వీఐపీ పాసులు ఇవ్వడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. మోదీ తల్లిని దూషించిన రాహుల్‌కి మన సంస్కృతిపై గౌరవం లేదనే సంగతి అర్థం చేసుకోవాలని అన్నారు.

ఎక్కడా యూరియా కొరత లేదు

రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదు

అవసరం మేరకు పంట చేలకు ఎరువులు వినియోగించండి

సస్యరక్షణ చర్యలు పాటించండి

కలెక్టర్ ప్రశాంతి

6

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

ఉపాధ్యాయులకు సత్కారం

పెరవలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కానూరులో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ, లయన్స్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ విజయ కుమార్‌రాజు జన్మదినం సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. అనంతరం రిటైర్డ్ ఉపాధ్యాయులు శిరిగినీడి శేషగిరిరావు, ఉపాధ్యాయులు జీ. అనురాధ, సిద్ధా వాసుదేవరావు, ఎంవీ వీఎస్ రాజేశ్వరరావును మాదిరెడ్డి బాబూజీరావు, కానూరు సొసైటీ అధ్యక్షుడు వాకలపూడి వీర్రాజు చేతులమీదుగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బావన మధు, దేవరపు వెంకటరాయుడు, సెక్రటరీ సలాది బాస్కరరావు, ట్రెజరర్ బూరుగుపల్లి రాజు, కోలా సీతయ్య నాయుడు, ఏడిద సత్యనారాయణ, యాతం రామకృష్ణ, అడపా


శ్రీనివాస్ కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

బాలు, ముళ్ళపూడి రాజేంద్రప్రసాద్, అనపర్తి సత్తిపండు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (పెరవలి)ని ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు పెదప్రోలు శ్రీనివాస్ కుమార్ , గుల్లపాటి రేణుకాదేవిను పాఠశాల ఆవరణలో సత్కరించారు. పాఠశాల ఉపాధ్యాయులు చక్రవర్తి, రాజేష్, రాధిక, ఎంఈవో - 2 నూర్జహాన్, రిటైర్డ్ ఉపాధ్యాయులు రామకృష్ణ, లైబ్రేరియన్ వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ప్రిన్సిపాల్ తిరుగు భీమేశ్వరరావు, ఏడిద సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

భూముల అవకతవకలపై విచారణ


బాధితులతో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌రెడ్డి

గోపాలపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కరిచర్లగూడెం రెవెన్యూ పరిధి 150 సర్వే నెంబర్‌లో ఉన్న భూముల్లో అవకతవకలు జరిగాయని ఇటీవల కొందరు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ పీ.ప్రశాంతి విచారణకు ఆదేశించటంతో ఆమె ఆదేశాల మేరకు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌రెడ్డి గురువారం గోపాలపురం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. దీనిలో భాగంగా ఫిర్యాదుదారుడితో మాట్లాడి అభిప్రాయాలు సేకరించారు. అనంతరం ఫిర్యాదుకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. విచారణలో తన దృష్టికి వచ్చిన విషయాలను కలెక్టర్ నివేదిస్తానని ఆయన చెప్పారు.

తిరుగుడుమెట్టలో ఉపాధ్యాయ దినోత్సవం

తాళ్లపూడి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుగుడుమెట్టలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనికి లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్ లయన్ యనమదల సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా విచ్చేశారు. కాగా, లయన్స్ ఇంటర్నేషనల్ 3వ వైస్ ప్రెసిడెంట్ పీఎంజేఎఫ్ లయన్ వీ. విజయకుమార్ రాజా పుట్టినరోజు సందర్భంగా జిల్లా గవర్నర్ సూచన మేరకు ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులను


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నున్న శేఖరబాబు, కొఠారు కృష్ణారావు, జమ్ముల నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మాంటిస్సోరీ పాఠశాలలో ఓనం వేడుకలు

తాళ్లపూడి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కేరళ రాజు మహాబలి తిరువానం రోజున కేరళ ప్రజల కోసం భూమిమీదకు వస్తారని, ఆదేరోజున ఓనం పండుగ నిర్వహించుకుంటామని మాంటిస్సోరీ పాఠశాల ప్రిన్స్‌పాల్ వీవీ అనీష్ తెలిపారు. పాఠశాలలో ఓనం పండుగను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పెద్ద పెద్ద ముగ్గులు పూలతో వేసి ఓనం పండుగను జరిపారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు, పాయసం పంచిపెట్టారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే తాళ్లపూడి సెయింట్ యూజిన్ పాఠశాలలోనూ గురుపూజోత్సవం, ఓనం పండుగను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఏ. జాన్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ గురువు అనగానే ప్రతి ఒక్కరికీ గుర్తుకు వచ్చేది డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని అన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

పెరవలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కానూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు. దీంతో కానూరు, నడిపల్లి, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు పరిశర ప్రాంతాలకు కరెంట్ ఉండదన్నారు. పరిసర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు అంతరాయం కలుగుతుందన్నారు.

భవన నిర్మాణ కార్మికుల హామీలు నెరవేరుస్తాం

● ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం పట్టణంలోని ప్రైవేట్ ఎలక్ట్రికల్ అండ్ ప్లంబింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రెండో మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షుడు ఎస్వీ వెంకన్న హాజరై యూనియన్ పతాకాన్ని ఎగురవేశారు. దీనికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేటు ఎలక్ట్రీషియన్స్ ప్లంబింగ్, భవన నిర్మాణ కార్మికులకు పట్టణంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తామన్నారు. అలాగే బీవోసీ బోర్డును పునరుద్ధరించి అన్ని సంక్షేమ పథకాలను అందజేస్తామన్నారు. అనంతరం సంఘం ముఖ్య సలహాదారుడు నంబూరి శ్రీమన్నారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జా రామకృష్ణ, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు ఈమని మల్లిక మాట్లాడారు. తర్వాత ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ అండ్ ప్లంబింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా రొంగల హరీష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా మరపట్ల శ్రీనివాస్, కోశాధికారిగా చిన్నప్ప శ్రీనివాస్‌తో కూడిన నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, సంఘం నేతలు ఎం.శ్రీనివాసు, బీ. శ్రీనివాస్, రాఘవేంద్రరావు, వీరబ్రహ్మం, చిన్నప్ప శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి, తదితరులు

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత

పేద ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తూ.. అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో గురువారం కొవ్వూరు మండలానికి చెందిన 11 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.7,53,793 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను వారి ఇంటికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కాకర్ల నారాయుడు, బేతిన నారాయణ, మంకిన వీర్రాజు, కంటిపూడి శ్రీనివాస్, వట్టికూటి వెంకటేశ్వరరావు, గారపాటి రామచంద్రరావు, చావా శ్రీనివాస్, నాయుడు వీర్రాజు, గొరిజాల సురేష్, పరిమి మురళీగణేష్, సూరపనేని చిన్ని, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గణనాథులకు ఘనంగా వీడ్కోలు

కొవ్వూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా పట్టణ, మండలంలోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటుచేసిన మండపాల్లో నిత్య పూజలందుకున్న విగ్రహాలను నిమజ్జనాలకు తరలిస్తున్నారు. యువత డప్పు వాయిద్యాల నడుమ కోలాహలంగా ఊరేగిస్తున్నారు. గురువారం కొవ్వూరు పాతపేట రామాలయం వద్ద ఏర్పాటుచేసిన వినాయకునికి పాతపేట యూత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. దీనిలో భాగంగా సుమారు రెండు వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం ప్రత్యేక వాహణంలో పట్టణ పురవీధులలో ఊరేగించారు. తదుపరి కొవ్వూరు గోష్పాద క్షేత్రానికి చేరుకున్నారు. పోలీసుల సహకారంతో ఏర్పాటుచేసిన క్రేన్ సహాయంతో వినాయకున్ని గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో వినాయక నిమజ్జనాలలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా డీఎస్పీ జీ.దేవకుమార్ ఆదేశాల మేరకు పట్టణ సీఐ పీ.విశ్వం, ఎస్ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో గోష్పాద క్షేత్రం వద్ద బందోబస్తును ఏర్పాటుచేశారు.


కొవ్వూరు పాతపేట రామాలయం వద్ద అన్నదానంలో పాల్గొన్న భక్తులు

పెరవలి: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం వినాయకుడి ఊరేగింపులు ఘనంగా నిర్వహించారు. తీపర్రు కాలువ రేవులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు , వివిధ వేషధారణలు, కోయ డ్యాన్సులు నిర్వహించారు. వినాయకుని వాహనాన్ని పూలతో అందంగా అలంకరించారు. ఒక బాలుడు ఆంజనేయ వేషధారణతో అందరినీ ఆకట్టుకున్నాడు.

ఉండ్రాజవరం: వేలివెన్ను గ్రామంలో రెండు రోడ్ల మొగసెంటర్‌లో ఉన్న వినాయకస్వామి ఆలయ కమిటి ఆధ్వర్యంలో గురువారం వినాయకస్వామివారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామివారిని ఊరేగించారు. వివిధ దేవతా విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఊరేగించడం భక్తులను ఆకట్టుకుంది. వివిధ బ్యాండుమేళాలతో స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. తాడిపర్రు, ఉండ్రాజవరం, మోర్త తదితర గ్రామాల్లో వినాయస్వామివారి విగ్రహాలను వైభవంగా ఊరేగించారు.

దేవరపల్లి: నిమ్మలపాడు దిబ్బ వద్ద గల వినాయకుడి ఆలయం గురువారం అంగరంగ వైభవంగా ఊరేగింపును నిర్వహించారు. దీన్ని గోపాలపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి సువర్ణరాజు ప్రారంభించారు. విగ్రహాన్ని ప్రత్యేక వాహనం పై అలంకరించి పురవీధుల్లో మేళతా ళాలు, బాణసంచాలు కాల్చుతూ ర్యాలీగా సాగారు. అనంతరం తాడిపూడి కాల్వలో నిమజ్జనం చేశారు.జనసేన నేత పసుపులేటి శివనాగ ప్రసాద్, మాధవరపు వెంకటేశ్వరరావు, కవల సీతారత్న సూర్యకుమారి, కంబాల సత్తిబాబు, సొసైటీ ఛైర్‌పర్సన్ ఉప్పులూరి రాంబాబు, టీడీపీ నేతలు సుంకర దుర్గారావు, వినాయకుడి కమిటీ సభ్యులు కవల సోమరాజు, కవల రాంబాబు, ఆకుల దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: ఆవపాడు 4వ వార్డులో ఏర్పాటు చేసిన బాల వినాయకుడి నిమజ్జ కార్యక్రమాన్ని గ్రామ యువత గురుఆరం ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి గ్రామ పురవీధుల్లో స్వామి వారిని ఊరేగిస్తూ బాణసంచాలు కాల్చుతూ తీన్‌మార్ డప్పుల మధ్య నిమజ్జనం చేశారు. అనంతరం పలు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు నెంబరు ఆచ్యుత సుబ్బారావు,ఆచ్యుత తాతాజీ, జోగినిడి రవి, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక

కొవ్వూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణం, మండలంలో ఆరుగురు ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. పెనకనమెట్ట జడ్పీ హైస్కూల్ హెడ్ మాస్టార్ సీహెచ్ క్షేమకుమార్, పట్టణంలోని జడ్పీ గర్ల్స్ హైస్కూల్ హెడ్ మాస్టార్ టీఎస్ రామానుజం, పశివేదల జడ్పీ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్ జీవీ నాగతులసీ, పంగిడి జడ్పీ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్ ఎస్‌కే రషీద, తోగుమ్మి జడ్పీ హైస్కూల్ ఇంగ్లీషు స్కూల్ అసిస్టెంట్ జే.ప్రసన్నలక్ష్మి, వాడపల్లి ఎంపీపీఎస్- 2 హెచ్‌ఎం బీ.ప్రసాద్‌ను ఉన్నారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవార్డులు అందుకోనున్నారు.

గోపాలపురం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో నలుగురు ఉత్తమ టీచర్లుగా ఎంపికయ్యారు. వారిలో రేగులకుంట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణరావు, గోపాలపురం జడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్, వేలచింతలగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల టీచర్ ఎస్‌సీహెచ్ రత్నకుమారి, చిట్యాల ఎంపీపీఎస్ ఉపాధ్యాయుడు సీహెచ్ సూర్యచంద్రం ఉన్నారు.

దేవరపల్లి: మండలానికి చెందిన ముగ్గురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యారు. ఇందులో దేవరపల్లి అంబటి సత్యనారాయణరావు, జడ్పీహైస్కూల్‌లో వ్యాయమాల టీచర్‌గా పనిచేస్తున్న ఓరుగంటి నాగరాజు, యర్నగూడెం ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు గంగరాజు ఉన్నట్టు ఎంఈవో తిరుమలదాసు తెలిపారు.

ఉండ్రాజవరం: కాల్థరి నెం.3 పాఠశాలకు చెందిన టీచర్ పులి కుసుమ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ఈ నెల 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరంలో జిల్లా అధికారుల నుంచి అవార్డు అందుకోనున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు కుసుమను అభినందించారు.

600 కిలోల గంజాయి స్వాధీనం

తాళ్లపూడి, సెప్టెంబరు 4 (ఆంధ్రజోతి): తాళ్లపూడి మండలం మలకపల్లి వద్ద గురువారం 600 కేజీల గంజాయిను పోలీసులు పట్టుకున్నారు. విశాఖ జోనల్ యూనిట్ నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) అధికారులకు టీఎన్69 ఏఎం 4777 నెంబర్ గల ఇన్నోవా వాహనంలో గంజాయి వస్తుందనే సమాచారం అందడంతో వెంబడించారు. దీంతో కొవ్వూరు టోల్‌గేటు వద్దకు వచ్చేసరికి నిందితులు తప్పించుకుని పారిపోతుండగా మలకపల్లి వద్ద పోలీసులు అటకాయించారు. గంజాయిని తరలిస్తున్న వారిలో ఇద్దరు కారు దిగి పారిపోగా, పట్టుబడ్డ మహరాజన్ రాజాను విచారణ నిమిత్తం తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌కి తరలించారు. కాగా, కారును పరిశీలించగా మొత్తం 292 గంజాయి ప్యాకెట్లు లభ్యమవగా, వాటి విలువ రూ. మూడు కోట్ల వరకు ఉండొచ్చని అధికారులు గుర్తించారు. ఈ మేరకు నిందితుడ్ని, వాహనాన్ని రాజమహేంద్రవరం తరలించి, అక్కడ పూర్తి సమాచారం అందిస్తామని నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అధికారులు పేర్కొన్నారు.

చాగల్లులో బుల్లితెర గాయని శ్రీలలిత

చాగల్లు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం బుల్లితెర గాయని శ్రీలలిత చాగల్లు విచ్చేశారు. తెలగ సంఘం వారి ఆధ్వర్యంలో జరిగిన రోషన్‌లాల్ ఆర్కెస్ట్రాలో ఆమె పాల్గొని పాటలు పాడారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గండ్రోతు సురేంద్రకుమార్ గృహంలో విలేఖరులతో మాట్లాడారు. జీ తెలుగు సరిగమ పదనిసలు కార్యక్రమంలో తొలిసారిగా బుల్లితెరపై పాల్గొన్నట్లు చెప్పారు. అలాగే పాడుతా తీయగా, బోల్ బేబీ బోల్, సహా బుల్లితెర పాటల కార్యక్రమంలో పాల్గొని అనేక పతకాలు గెలుచుకున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి నిర్వహించిన దుర్గ ఈజ్ ఇన్ ఎవ్విర్ ఉమెన్ అనే కార్యక్రమంలో పాల్గొని ఆమె చేతులమీదుగా సత్కారం పొందడం మరిచిపోలేని అనుభూతి ఇచ్చిందన్నారు. కర్నాటక సంగీతం, హిందుస్థానీ సంగీతంలో ప్రావీణ్యం పొంది నిరంతర సాధన చేయడం వల్ల గాయనిగా రాణించగలుగుతున్నానన్నారు.

యువకుడిపై కేసు నమోదు

కొవ్వూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పిన్నిని నమ్మించి అనుమతి లేకుండా అకౌంట్‌లో సొమ్మును వినియోగించుకుని మోసం చేసిన యువకుడిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరురూరల్ ఎస్ఐ కే.శ్రీహరిరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం కొవ్వూరు మండలం మద్దూరులంకకి చెందిన మార్కంటి వైడూర్యం భర్త రమేష్ ఇతర దేశంలో పనికి వెళ్లాడు. అక్కడి నుంచి కుటుంబ పోషణ నిమిత్తం కొంత డబ్బు పంపిస్తున్నాడు. ఇటీవల వైడూర్యం అక్క కొడుకు కప్పల వినోద్ పిన్ని నాకు కళాశాలలో సీటు కోసం అవసరమంటూ. మొబైల్ తీసుకుని ఫోన్‌పే ద్వారా అనుమతి లేకుండా దశలవారీగా అకౌంట్‌లో ఉన్న డబ్బు రూ.1,50,000 తన అవసరాలకు వినియోగించుకున్నాడు. దీన్ని గ్రహించిన వైడూర్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఒకరికి గాయాలు

కొవ్వూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా రెండు మోటారుసైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి గాయపడినట్టు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. పట్టణంలోని శ్రీరామకాలనీకి చెందిన బోడపాటి రామారావు ఈనెల 3వ తేదీన బైక్‌పై రాజమహేంద్రవరం బయలుదేరాడు. కాగా, రోడ్డు కం రైలు బ్రిడ్జిపై కొవ్వూరువైపు టర్నింగ్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన రామారావును రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

నాపై కుట్రపూరితమైన ఆరోపణలు

చాగల్లు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వేదికగా గత కొద్ది రోజులుగా నాపై కుట్రపూరితంగా తప్పుడు ఆరోపణలతో ట్రోలింగ్ చేస్తున్నారని రంగస్థల నటుడు, సత్య హరిశ్చంద్ర పాత్రధారి డీవీ సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం చాగల్లు మాజీ సర్పంచ్ గండ్రోతు సురేంద్రకుమార్ ఇంట్లో ఆయన విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయనపై వస్తున్న ఆరోపణలను ఖడిస్తూ వివరణ ఇచ్చారు. సంపత్ వరసిద్ధి వినాయక ఆలయ ప్రాంగణంలో ఈనెల ఒకటో తేదీన చాగల్లు వర్తక సంఘం వారి కళావేదికపై సత్య హరిశ్చంద్ర నాటకం ప్రదర్శించారు. ఈసందర్భంగా చంద్రమతి పాత్రధారి నెల్లూరి భానుమతి పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్టు, కులం పేరుతో దూషించినట్టు వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో వీడియో పెట్టారని చెప్పారు. అందులోని అంశాలను ఆయన ఖండిస్తూ వివరణ ఇచ్చారు. ఆయన 5 సంవత్సరాల వయస్సు కలిగి ఉన్నప్పుడు తల్లి చనిపోయిందని, తండ్రి నాటకాలు కోసం వెళ్లే సమయాల్లోను, ప్రదర్శన ప్రదేశాల్లోను ఆమె తనను కన్న తల్లిలాగా చూసుకునేదని చెప్పారు.

ఎక్కడా యూరియా కొరత లేదు : కలెక్టర్ ప్రశాంతి

తాళ్లపూడి, సెప్టెంబరు 4 (ఆంధ్రజోతి): రైతులకు అవసరం మేరకు యూరియా ఉందని, ప్రస్తుతానికి ఎక్కడా కొరత లేదని కలెక్టర్ పీ. ప్రశాంతి అన్నారు. రాగోలపల్లి, అన్నదేవరపేట సొసైటీలను గురువారం సందర్శించి ఎరువుల వినియోగం సరఫరా పరిస్థితులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి రాగోలపల్లి సొసైటీ వద్ద రైతులతో మాట్లాడుతూ భూసారం, పంట విస్తీర్ణం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని దశల వారీగా ఎరువులను వినియోగించుకోవాలని సూచించారు. ఎరువులు ఎక్కువగా వేసినంత మాత్రాన దిగుబడి పెరగదు కానీ నష్టాలు ఎదుర్కోవలసి వస్తుందని అవసరానికి మించి ఎరువులు వాడకూడదన్నారు. సొసైటీలో గతంలో మాదిరిగానే ప్రస్తుతం సీజన్లో కూడా ఎరువు ల వినియోగం ఒకేలా ఉందన్నారు. అన్నదేవరపేట సొసైటీలో 65 మెట్రిక్ టన్నుల యూరియా వినియోగం జరిగిందని గత సీజన్‌లో కంటే అధికం అని అన్నారు. ప్రభుత్వం పంటలకు సరిపడే విధంగా ఎరువులు సరఫరా చేస్తుందని యూరియా సరఫరా విషయంలో కూడా ఎటువంటి ఇబ్బంది లేదని రైతులు ఆందోళన చెందనవసరం లేదని కలెక్టరు అన్నారు. పంట సాగుకు అను గుణంగా నవధాన్యాలను ఎక్కువగా వినియోగించడం వల్ల భూమి సారవంతం అవుతుందని అన్నారు. డీఏవో ఎస్ మాధవరావు, ఎం. వెంకటరమణ, తహశీల్దార్ లక్ష్మీలావణ్య, ఏవో రుచిత, ఆర్ఐ రామకృష్ణ, సొసైటీ సభ్యులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.


రాగోలపల్లి సొసైటీ వద్ద రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

అవసరం మేరకే ఎరువులు వాడాలి : ఆర్డీవో


దొమ్మేరు సొసైటీని తనిఖీ చేస్తున్న ఆర్డీవో

కొవ్వూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అవసరానికి మించి ఎరువులు, పురుగులు మందులు వాడినట్టయితే పంటలకు మేలు కంటే నష్టం కలుగుతుందని కొవ్వూరు ఆర్డీవో రాణీసుస్మిత తెలిపారు. గురువారం దొమ్మేరు, కాపవరం సొసైటీలను సందర్శించి, యూరియా నిల్వలు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. రైతులకు సరఫరా అయ్యే ఎరువులు సక్రమంగా వినియోగమవుతున్నాయా లేదా అనే అంశాలను, రికార్డుల నిర్వహణపై సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. రైతులు సాగుకు సంబంధించి వ్యవసాయాధికారులు, సూచనల మేరకు మాత్రమే దశలవారీగా ఎరువులను వాడాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, సొసైటీ సిబ్బంది, ఎరువుల దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

పట్టాభిని కలిసిన స్వచ్ఛ ఏపీ మిషన్ డైరెక్టర్

నల్లజర్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నేత, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్ డైరెక్టర్ కూచిపూడి ఉదయభాస్కర్,హజ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు షేక్ మీరా సాహెబ్ గురువారం స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ మిషన్ ఛైర్మన్ పట్టాభిని అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. తమకు పదవి కల్పించినందుకుగాను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు, ఛైర్మన్ పట్టాభిని శాలువతో సత్కరించారు. వారి వెంట దూబచర్లకు చెందిన సింహ ఉన్నారు.


అమరావతిలో పట్టాభిని సత్కరిస్తున్న దృశ్యం

అశ్లీల నృత్య ప్రదర్శనపై కేసు

నల్లజర్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలికిచర్లలో వినాయకుని నిమజ్జనోత్సవాల్లో భాగంగా ఆ గ్రామ వీధుల్లో అశ్లీల నృత్య ప్రదర్శన చేపట్టినట్టు సోషల్ మీడియాలో హల్‌చల్ కావడంతో విచారణ నిమిత్తం గురువారం కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ నల్లజర్ల విచ్చేశారు. గ్రామంలో జరిగిన సంఘటనపై విచారించి వీఆర్వో శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐదుగురు నిర్వాహకులు, ఇద్దరు ట్రాన్స్‌జెండర్లను ఆదుపులోకి తీసుకున్నారు. అలాగే ట్రాక్టర్, డీజే సౌండ్ బాక్సులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు. పోలీస్ సిబ్బంది, తదితరులున్నారు.


పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ

అక్షరాంధ్రను ముందుకు తీసుకెళ్లాలి : ఎంపీపీ

దేవరపల్లి, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అక్షర ఆంధ్ర నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చి వారి జీవనవిధానంలో మార్పు తీసుకురావడానికి అధికారులు కృషిచేయాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం అక్షరాంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అక్షరాంధ్ర కార్యక్రమాన్ని ప్రతి పంచాయతీ పరిధిలో వలంటీర్ల ద్వారా సాయంత్రం సమయంలో ఐదుగంటల నుంచి ఏడు గంటల వరకు శిక్షణ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులకు విద్యనందించే దృఢసంకల్పంతో కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో అక్షరాంధ్ర స్పెషల్ ఆఫీసర్ ఎంపీడీవో వై.రాజారావు, ఎంఈవోలు తిరుమలదాసు, కేఆర్ఎస్‌వీ అప్పారావు, దుద్దుకూరు హెచ్‌ఎం వీర్రాజు, ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో జీ.శ్రీనివాస్, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న దుర్గారావు

కొవ్వూరు ఎంఈవోగా శ్రీదేవి


ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలుసుకున్న నూతన ఎంఈవో

కొవ్వూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండల విద్యాశాఖాధికారిగా కే.శ్రీదేవి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎంఈవో డాక్టర్ ఏ.రామకృష్ణారావు పదవీ విరమణ పొందారు. దీంతో పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం యండగండి హైస్కూల్లో సోషల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శ్రీదేవికి పదోన్నతి కల్పిస్తూ కాకినాడ ఆర్జేడీ జీ.నాగమణి ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ కాకర్ల నారాయుడును ఆమె మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ధర్మబద్ధంగా జీవితం సాగించాలి

చాగల్లు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మనం ధర్మంను ఆచరిస్తే ధర్మమే మనలను కాపాడుతుందని వీ. రామ్మోహనరావు అన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ప్రతి రోజు సాయంత్రం సమయంలో ఆయన సంపత్ వరసిద్ధి వినాయకుడు ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక ప్రవచనం చెప్పారు. రామాయణంలో రాముడు సూచించిన ధర్మం మనకు ఆదర్శం కావాలని చెప్పారు. రామాయణంలోని సుందరాకాండ, యుద్ధకాండ లోని అంశాలను ఆయన భక్తులకు వివరించారు. తల్లిగా, తండ్రిగా పిల్లలుగా కుటటుంబ సభ్యులుగా మన ధర్మం మనం బాధ్యతయుతంగా పాటించాలన్నారు. తోటి ప్రాణుల పట్ల భూత దయ కలిగి ఉండాలని చెప్పారు. హిందు ధర్మ పరిరక్షణకు మన వంతు కృషి చేయాలని చెప్పారు. నేటి సమాజంలో యువతకు ధర్మ పరిరక్షణ బాధ్యత మరింతగా ఉందని అన్నారు.